2047 నాటికి ప్రతి ఒక్కరికీ ఇన్సూరెన్స్‌ను అందించాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన ప్రస్తుత తరుణంలో, ఆదాయ అంతరాలను తగ్గిస్తూ, ప్రజలకు సామాజిక భద్రతను కల్పిస్తూ, రాజ్యాంగ పీఠిక ప్రబోధించిన సమానత్వం, సార్వభౌమత్వం అనే కీలక అంశాలే ప్రాతిపదికగా, అద్భుత పనితీరుతో అంతర్జాతీయ గుర్తింపు పొందిన, దేశ ఆర్థిక వ్యవస్థకు అమృత తుల్యమైన ఎల్ఐసీ వంటి ప్రభుత్వరంగ ఆర్థిక సంస్థను డిజిన్వెస్ట్‌మెంట్ పేరుతో ప్రభుత్వ వాటాలను అమ్ముకోవడం ప్రజామోదయోగ్యం కాదు.

• **జి. కిశోర్‌కుమార్**
జాయింట్ సెక్రటరీ, SCZIEF

జెన్‌జీ ఉద్యమాన్ని నీరుగార్చలేరు!

ఈ దేశంలో జరుగుతున్న జెన్‌జీ ఉద్యమానికి లేని ఉద్దేశ్యాలను, లక్ష్యాలను ఆపాదించి విద్యార్థుల న్యాయమైన అసంతృప్తిని డీలెజిటిమైజ్ చేయడానికి ఒక విఫల ప్రయత్నం చేశారు వ్యాసకర్త అరవిందరావు (20 ఆగస్టు 2026న ఆంధ్రజ్యోతిలో తాను రాసిన వ్యాసంలో). ఉద్యమం వెనుక బుద్ధిజీవులున్నారని, 'దేశాన్ని బలహీనపరచడం, అంతర్గతంగా విచ్ఛిన్నం చేయడమే' వారి ఎజెండా అని రాశారు. ప్రధాని మోదీ 'దిమాగీ నక్సల్స్'కు ఇది నిర్వచనం, కొనసాగింపు. అంతేగాక 'రాజకీయ పార్టీలు విద్యార్థుల వీపులపై స్వారీ చేసి ప్రభుత్వాన్ని దించాలని ఆశపడుతున్నాయి' అన్నారు. ఈ వాదనల నిరూపణకు చైనాను ఉదహరించారు. ఇంకా అన్యాయంగా, అసందర్భంగా దీనికి పూర్తి వ్యతిరేకమైన బెర్నార్డ్ షాను వాడారు.

పేపర్ లీక్‌లు, పరీక్ష మోసాలు పరిశీలిస్తే.. 2005–2026 మధ్యకాలంలో 21 రాష్ట్రాలలో 220 సంఘటనలు నమోదయ్యాయి. ఇందులో 2015కు ముందు 72 కేసులు నమోదు కాగా, 2015 తర్వాత 148 కేసులు నమోదయ్యాయి. ఈ ఘటనలు అన్ని ప్రభుత్వాల హయాంలలోనూ జరిగాయి. కానీ బీజేపీ, దాని మిత్రపక్షాల పాలనలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మొత్తం 220 కేసులలో ఎన్డీఏ పాలనలో 128 కేసులు (58శాతం), కాంగ్రెస్, దాని మిత్రపక్షాల పాలనలో 55 కేసులు (25 శాతం) నమోదయ్యాయి. 2015 తర్వాత బీజేపీ వాటా ఇంకా పెరిగింది. నమోదైన 148 కేసులలో 99 కేసులు (67 శాతం) ఎన్డీఏ పాలనలోనే చోటుచేసుకున్నాయి.

'పేపర్ లీక్‌లు కావడం కాంగ్రెస్ హయాంలో అతి సాధారణమైన విషయం' అని వ్యాసకర్త వ్యాఖ్యానించారు. కానీ గణాంకాలు దానికి వ్యతిరేకంగా ఉన్నాయి. 2015కు ముందు నమోదైన కేసుల్లో కేవలం 12 కేసుల్లోనే సీబీఐ శిక్ష వేయించగలిగింది. కానీ, 2015 తర్వాత 148 కేసులలో కేవలం ఒక్క కేసులోనే నేరం రుజువై శిక్ష పడింది. అది కూడా చండీగఢ్‌లోనే. సీబీఐకి 2015 తర్వాత కనీసం 17 కేసులు దర్యాప్తునకు అప్పగించారు. అందులో శిక్ష నమోదు రికార్డు సున్నా! అదే సమయంలో 11 కేసులలో ఈడీ పనితీరు శూన్యం. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో జవాబుదారీతనం కుప్పకూలిపోయింది. అంచెల కుల సమాజంలో పరీక్ష వ్యవస్థలకు ఉండే సమానత్వ సామర్థ్యం దెబ్బతిని, సాధికారతే ప్రశ్నార్థకం అయింది.

యూజీసీ నెట్–2024 పేపర్ లీక్ ఘటనలో నేను కూడా బాధితుడినే. ఈ ఏడాది కూడా ప్రశ్న పత్రంలో అక్షరదోషాల వల్ల మూడు పేపర్లను రద్దు చేశారు. ఇంతటి తీవ్ర సంక్షోభానికి సమాధానం అడగవలిసిన వ్యవస్థలు ఈ దేశ విద్యార్థులకు నిరాశను మిగల్చడమే కాక 'బొద్దింకలు' అని అవమానపరిచాయి. దిగజారిన రాజ్యాంగ, ప్రజాస్వామిక విలువలను, జవాబుదారీతనాన్ని తట్టి లేపి, తిరిగి తన న్యాయమైన స్థానంలో పునరుద్ధరించడం కోసమే ఈ ఉద్యమం. ఎంత దాడి జరిగినా విద్యార్థి ఉద్యమం మాత్రం సమాజాన్ని మానవీకరించే దిశగా, వ్యవస్థలను ప్రజాస్వామీకరించి కాపాడుకునే దిశగానే సాగుతుంది.

○ **పి. ఆనంద్**
పీహెచ్‌డీ విద్యార్థి, పుదుచ్చేరి

వెయ్యి రోజుల ప్రజాపాలన!

తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, ఆశయాలు, ఆత్మగౌరవాన్ని పాలనకు కేంద్రబిందువుగా చేసుకుని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఈ వెయ్యి రోజులు కేవలం క్యాలెండర్లో గడిచిన రోజులు కావు. తెలంగాణ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసిన నిర్ణయాల కాలం.

యువతకు ఉద్యోగాలు, రైతుకు భరోసా, మహిళలకు ఆర్థిక స్వావలంబన, పేదలకు గౌరవప్రదమైన జీవనం, రాష్ట్రానికి భారీ పెట్టుబడులు– ఇవన్నీ సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం. ప్రభుత్వం ఏర్పడిన కొద్ది గంటల్లోనే అమలు చేసిన మహాలక్ష్మి పథకం ఇందుకు నిదర్శనం.

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ద్వారా కోట్లాది మంది మహిళలకు ఆర్థిక ఉపశమనం లభించింది. ఇప్పటి వరకు 345 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు జరిగి, మహిళలు సుమారు రూ.12,075 కోట్ల ప్రయాణ వ్యయాన్ని ఆదా చేసుకున్నారు. ఈ పథకం విజయవంతం కావడంతో పెరిగిన ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ ఆర్టీసీని బలోపేతం చేయడంపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. కొత్త బస్సుల కొనుగోలు, ఆధునిక బస్ స్టేషన్ల నిర్మాణం, కొత్త డిపోల ఏర్పాటు, ఉద్యోగ నియామకాలు, ఉద్యోగుల సంక్షేమం వంటి అనేక చర్యలతో ఆర్టీసీని ప్రజలకు నమ్మకమైన ప్రజా రవాణా సంస్థగా తీర్చిదిద్దింది. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమంలోనూ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. 2013 నుంచి పెండింగులో ఉన్న రూ.280కోట్ల బాండ్లను క్లియర్ చేయడం; 2017, 2021 పే స్కేల్ సమస్యలను పరిష్కరించడం; 11వ పీఆర్సీ అమలు; పెండింగులో ఉన్న డీఏల విడుదల; పీఎఫ్, సీసీఎస్ బకాయిల తగ్గింపు వంటి చర్యలు ఉద్యోగుల్లో నూతన విశ్వాసాన్ని నింపాయి.

> **వెయ్యి రోజుల ప్రజాపాలన ఒక మైలురాయి మాత్రమే. తెలంగాణను మరింత బలమైన, సమానత్వంతో కూడిన, పెట్టుబడులకు అనుకూలమైన, ఉపాధి అవకాశాలు కలిగిన, పర్యావరణహితమైన, ప్రపంచస్థాయి రాష్ట్రంగా తీర్చిదిద్దే ప్రయాణంలో ఇది ఒక కీలక దశ.**

తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు రైతు వెన్నెముక. ప్రజా ప్రభుత్వం రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేసి 25 లక్షలకు పైగా రైతు కుటుంబాలను రుణభారం నుంచి విముక్తి చేసింది. రైతు భరోసా కింద రూ.36వేల కోట్లకు పైగా పెట్టుబడి సాయం అందించింది. సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్, ఉచిత విద్యుత్, రైతు బీమా, పంట నష్ట పరిహారం వంటి కార్యక్రమాలతో రైతుకు ప్రభుత్వం అండగా నిలిచింది. ధాన్యం కొనుగోళ్లలోనూ తెలంగాణ కొత్త రికార్డులు సృష్టించింది.

సంక్షేమం అంటే కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు; ఒక కుటుంబానికి విద్యుత్ భారం తగ్గించడం, వంటగ్యాస్ ఖర్చును తగ్గించడం, నాణ్యమైన బియ్యం అందించడం, ఇల్లు నిర్మించుకునే అవకాశం కల్పించడం– ఇవన్నీ కుటుంబ జీవన ప్రమాణాలను మెరుగుపరిచే చర్యలే. ప్రభుత్వం గృహజ్యోతి ద్వారా 53 లక్షలకు పైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చింది. దాదాపు 43 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందుతోంది. 15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులను జారీ చేసి, మరింత మందిని ఆహార భద్రత పరిధిలోకి తీసుకువచ్చింది. రేషన్ కార్డుదారులకు నాణ్యమైన సన్నబియ్యం అందించే కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన పేదలకు సొంత ఇంటి కలను నిజం చేసే దిశగా అడుగులు వేస్తున్నది.

మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములుగా చేసేందుకు స్వయం సహాయక సంఘాలకు భారీగా బ్యాంకు లింకేజీ కల్పించడం; వడ్డీ రాయితీలు ఇవ్వడం; పాఠశాల యూనిఫాంలు, చీరల తయారీ, పెట్రోల్ బంకుల నిర్వహణ, ఆర్టీసీ బస్సుల యాజమాన్యం వంటి కొత్త ఆదాయ మార్గాలను ప్రభుత్వం కల్పించింది.

సామాజిక న్యాయం కోసం రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను పూర్తి చేసింది ప్రజాప్రభుత్వం. బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభ ఆమోదించి కేంద్రానికి పంపింది. ఎస్సీ ఉపకులాల వర్గీకరణను అమలు చేయడం ద్వారా సామాజిక న్యాయంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమానికి రాష్ట్ర మొత్తం వ్యయంలో గణనీయమైన వాటాను కేటాయిస్తున్నది.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించడం, కొత్త రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేయడం, ఉపాధ్యాయ నియామకాలను చేపట్టడం ద్వారా విద్యా రంగంలో సమగ్ర మార్పులకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మెగా డీఎస్సీ ద్వారా 10,006 మంది ఉపాధ్యాయుల నియామకం జరిగింది.

యువత ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా 72 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టింది ప్రభుత్వం. ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న యువతకు నైపుణ్యాభివృద్ధి ద్వారా కొత్త అవకాశాలను కల్పిస్తున్నది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, టాస్క్, టీ–హబ్, టీ–వర్క్స్, వీ–హబ్ వంటి సంస్థల ద్వారా వేలాది మంది యువతకు ఆధునిక నైపుణ్య శిక్షణ అందుతోంది.

తెలంగాణను పెట్టుబడుల అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పారిశ్రామిక విధానాల్లో సంస్కరణలు చేపట్టింది. టీజీ–ఐపాస్ ద్వారా వేలాది పారిశ్రామిక యూనిట్లకు అనుమతులు ఇచ్చి భారీ పెట్టుబడులకు మార్గం సుగమం చేసింది. లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ వంటి భవిష్యత్ రంగాల్లో తెలంగాణను జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నది.

ప్రజా ప్రభుత్వం కేవలం ప్రస్తుత సమస్యలకు పరిష్కారాలు చూపడం మాత్రమే కాదు; వచ్చే తరాల తెలంగాణను నిర్మించేందుకు దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించింది. తెలంగాణ రైజింగ్–2047లో భాగంగా 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నది.

వెయ్యి రోజుల ప్రజాపాలన ఒక మైలురాయి మాత్రమే. తెలంగాణను మరింత బలమైన, సమానత్వంతో కూడిన, పెట్టుబడులకు అనుకూలమైన, ఉపాధి అవకాశాలు కలిగిన, పర్యావరణహితమైన, ప్రపంచస్థాయి రాష్ట్రంగా తీర్చిదిద్దే ప్రయాణంలో ఇది ఒక కీలక దశ. రైతు ముఖంలో చిరునవ్వు, మహిళ చేతిలో ఆర్థిక స్వావలంబన, యువతకు ఉద్యోగం, విద్యార్థికి నాణ్యమైన విద్య, పేదవాడికి సొంత ఇల్లు, ప్రతి కుటుంబానికి ఆరోగ్య భద్రత, ప్రతి ప్రాంతానికి అభివృద్ధి – ఇదే ప్రజా పాలన లక్ష్యం.

• **పొన్నం ప్రభాకర్**
రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి

వేదికపై మాట్లాడుతున్న కవిత

సావిత్రీబాయి ఫూలే స్ఫూర్తితో పని చేస్తా

టీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత

- బోధన్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానన్నా.. కేసీఆర్ నా మాట వినలేదు
- ఆనాడు బీఆర్ఎస్ నేతల గెలుపు కోసం పనిచేస్తే కుట్రచేసి నన్ను ఓడించారు
- ప్రశాంత్‌రెడ్డి రాజకీయం మానేసుకో వెంటపడి ఓడిస్తా
- జిల్లాలో ఐదు అసెంబ్లీ స్థానాలను గెలుస్తాం
- పాంచజన్య సంకల్ప సభలో కవిత

సంకల్ప సభకు హాజరైన జనం

నిజామాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బోధన్ ఆడబిడ్డ అయిన సావిత్రీబాయి ఫూలే స్ఫూర్తితో తాను పనిచేస్తానని, జిల్లా ప్రజలు తనను ఆశీర్వదించాలని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో నిర్వహించిన టీఆర్ఎస్ పాంచజన్య సంకల్ప సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా కోడలిగా 20 ఏళ్లుగా జిల్లా ప్రజలు తనను చూస్తున్నారని ఎంపీగా, ఎమ్మెల్సీగా గెలిపించారని ఎక్కడికిపోయిన సరే జిల్లా ప్రజలు ఇచ్చిన ధైర్యంతో మాట్లాడుతున్నా నన్నారు. అప్పుడు ఏవిధంగా ఆశీర్వాదం ఇచ్చారో ఇప్పుడు అదే ఆశీర్వాదం ఇవ్వాలని కోరారు. పార్టీ ఏర్పాటు చేసి నాలుగు నెలల తర్వాత సొంత గడ్డకు రావడం సంతోషంగా ఉందని సొంత గడ్డపై సొంత మనుషులను చూసి కవిత భావోద్వేగానికి గురయ్యారు. ఏ తప్పుచేయలేదు కాబట్టే సుప్రీం కోర్టు సైతం కేసును కొట్టేసిందన్నారు.

బోధన్ షుగర్ ఫ్యాక్టరీని వంద రోజుల్లో తెరిపిస్తామని ఆనాడు కేసీఆర్ చెప్పారని, కేవలం రూ.18 కోట్లు ఇస్తే ఫ్యాక్టరీ తెరుచుకునేదని, కానీ కోరుట్ల ఎమ్మెల్యే కేటీఆర్‌కు స్నేహితుడు కావడం వల్లే ఆనాడు ఫ్యాక్టరీని తెరిపించలేదన్నారు. తాను ఎంత ప్రయత్నించినా తన మాట వినలేదని కవిత అన్నారు. మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డిపై కవిత తీవ్ర విమర్శలు చేశారు. తన తండ్రితో తనకు దూరం చేసిన వ్యక్తి ప్రశాంత్‌రెడ్డేనని హరీష్‌రావు, సంతోష్ రావును క్షమిస్తానేమోగాని

మిగతా 6వ పేజీలో...

సభ సక్సెస్, ఘన స్వాగతం

జిల్లా కోడలిగా కవిత టీఆర్ఎస్ పార్టీని స్థాపించి నాలుగు నెలల తర్వాత సొంత గడ్డకు వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభ విజయవంతం అయింది. జిల్లాలో తనకున్న పరిచయాలు, క్యాడర్‌తో కవిత సభ సక్సెస్‌పై దృష్టిపెట్టగా పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు తరలివచ్చారు. తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులతో పాటు తెలంగాణ జాగృతి నాయకులు అన్ని తానై సభను విజయవంతం చేశారు. పూర్తిస్థాయిలో సభ నిండడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం కనిపించింది. కవిత మాట్లాడినసమయంలో నేతలు, కార్యకర్తలు సీఎం.. సీఎం.. అంటూ నినాదాలు చేస్తూ ఉత్తేజపరిచారు. జిల్లా సరిహద్దులోని ఇందల్‌వాయి టోల్‌గేట్ నుంచి మొదలుకొని డిచ్‌పల్లి, మాదవనగర్, నిజామాబాద్ నగరంలో పెద్ద సంఖ్యలో వాహనాలతో పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు.

మహిళా కార్యకర్తలతో కరచాలనం చేస్తున్న కవిత

బోధన్ నుంచి పోటీపై సంకేతాలు

మహాత్మాజ్యోతిబా ఫూలే సతీమణి సావిత్రి బాయి ఫూలే బోధన్ ఆడబిడ్డేనని తాను కూడా బోధన్ ఆడబిడ్డగా బహుజన తెలంగాణ కోసం పోరాటం చేస్తానని, బోధన్ నుంచే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడతానని కవిత అన్నారు. పరోక్షంగా రాబోయే ఎన్నికల్లో తన సొంత నియోజకవర్గం అయిన బోధన్ నుంచి పోటీకి ఆమె సంకేతాలు ఇచ్చారు. జిల్లాలో త్వరలో అన్ని నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను నియమిస్తామని ఆమె అన్నారు.

ధర్పల్లి ఎరువుల గిడ్డంగి వద్ద యూరియా కోసం రైతుల పాట్లు

యాప్ తెచ్చిన తంట..

- యూరియా కోసం పడిగాపులు
- సెకన్ల వ్యవధిలోనే స్టాక్ ఖాళీ
- ఆన్‌లైన్ బుకింగ్‌తో రైతులకు తప్పని తిప్పలు
- సొసైటీ పరిధిలోనే పంపిణీ చేయాలని డిమాండ్

ఆలూర్/ధర్పల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు పడిగాపులు పడుతున్నారు. ఆలూర్ మండల కేంద్రంలోని పీఏస్ సీఎస్‌లో యూరియా స్టాక్ అయిపోవడంతో గోదామును మూసివేయడంతో రైతులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్‌లో యూరియా స్టాక్ అందుబాటులోకి వచ్చిన వెంటనే 10 నుంచి 20 సెకన్ల వ్యవధిలోనే బుకింగ్ పూర్తవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం 8.30 గంటలకు ధర్పల్లి సింగిల్ విండో కార్యాలయానికి యూరియా రావడంతో పెద్ద సంఖ్యలో రైతులు తరలివచ్చారు. కొందరు రైతులు యాప్‌లో బుకింగ్ చేసుకున్నప్పటికీ సాంకేతిక కారణాలతో కొద్దిమందికే యూరియా పంపిణీ చేసి, మిగతావారిని వెనక్కి పంపించడంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని యాప్‌లో బుకింగ్ విధానం అమలు చేయడం వల్ల వివిధ గ్రామాల రైతులు మండల కేంద్రానికి వచ్చి యూరియా కోసం పోటీ పడాల్సి వస్తోందని రైతులు పేర్కొన్నారు. పీఏస్ సీఏస్ లేదా సొసైటీ పరిధిలోని రైతులకు అదే సొసైటీలో యూరియా అందేలా ఆన్‌లైన్ విధానంలో మార్పులు చేయాలని కోరుతున్నారు. ధర్పల్లితో పాటు ఒన్నాజిపేట్, రామడుగు తదితర సింగిల్ విండోలు, గ్రామాల్లోని ఎరువుల దుకాణాల వద్ద స్థానిక రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందల్వాయి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ముందు రైతులు యూరియా కోసం ధర్నా చేపట్టారు. ఇందల్వాయి సొసైటీ పరిధిలోని చంద్రయాన్‌పల్లి, ఇందల్వాయి గ్రామాలలో 900 యూరియా బస్తాలు స్టాక్ ఉండగా కేవలం ఒక్క నిమిషంలోనే స్టాక్ మొత్తం ఆన్‌లైన్‌లో పూర్తి కావడంతో స్థానిక రైతులకు బస్తా యూరియా కూడా లభించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. యాప్ ద్వారా బుకింగ్ చేసుకోవడం తెలియని నిరక్షరాస్య రైతులు మరింత ఇబ్బందులు పడుతున్నారని, యాప్‌ను తొలగించి సొసైటీల్లోనే నేరుగా యూరియా పంపిణీ చేయాలని వారు కోరుతున్నారు.

సరిహద్దులు దాటనివ్వలే..

- 127 క్వింటాళ్ల 80కిలోల రేషన్ బియ్యం పట్టివేత
- మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు గుర్తింపు

నవీపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్ సమీపంలో సోమవారం అక్రమంగా తరలిస్తున్న 127 క్వింటాళ్ల 80కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఆర్మూర్ నుంచి నవీపేట మీదుగా మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు డీసీఎం వాహనంలో తరలిస్తుండగా ఫకీరాబాద్ సమీపంలో పట్టుకొన్నట్లు ఎస్ఐ వివరించారు. సంబంధిత రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ నాయబ్ తహసీల్దార్ పవన్ కుమార్‌కు అప్పగించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్న రెంజల్ మండలం సాటాపూర్‌కు చెందిన అర్బాజ్ ఖాన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

ఆరు మొరం టిప్పర్ల స్వాధీనం

వర్ని, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): చందూర్ మండలం ఘన్‌పూర్ గ్రామ సమీపంలో సోమవారం ఆరు మొరం టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ వీర్‌సింగ్ తెలిపారు. మండల కేంద్రం సమీపం నుంచి అక్రమంగా టిప్పర్ల ద్వారా మొరం తరలుతున్నట్లు అందతినర సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి వెళ్లిన ఆరు టిప్పర్లను పట్టుకున్నట్లు తెలిపారు. దీంతో టిప్పర్లను తహసీల్దార్ కార్యాలయంకు తరలించినట్లు చెప్పారు. పట్టుకున్న టిప్పర్లను జరిమానా వేయనున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. చందూర్ అటవీ ప్రాంతం ద్వారా అక్రమంగా మొరం తవ్వకాలు జరిపినట్లు తహసీల్దార్ తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన సీనియర్ సివిల్ జడ్జిలు

నిజామాబాద్ లీగల్, ఆగస్టు (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టులో సీనియర్ సివిల్ న్యాయాధికారులుగా పదోన్నతి పొందిన ముగ్గురు సోమవారం తమకు కేటాయించిన స్థానాల్లో బాధ్యతలు స్వీకరించారు. ఆర్మూర్ సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీదేవి నుంచి వారు బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ సీనియర్ సివిల్ న్యాయాధికారిగా అజయ్ ఉల్లమ్, అదనపు సీనియర్ సివిల్ న్యాయాధికారిగా చైతన్య, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శిగా ముద్దసాని సలీమా బాధ్యత స్వీకరించారు.

ఓటు హక్కు పరిరక్షణే కార్యకర్తల బాధ్యత

- ఎస్ఐఆర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలి
- ప్రతి ఓటును కాపాడాలి
- రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

డిచ్‌పల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ కార్యకర్తలు, బూత్ స్థాయి ఏజెంట్లు, గ్రామ శాఖ అధ్యక్షులు సమన్వయంతో పనిచేయాలని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి, రూరల్, అర్బన్ నియోజకవర్గాల ఎస్ఐఆర్ పరిశీలకులు జంగా రాఘవ రెడ్డిలు పిలుపునిచ్చారు. రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి అధ్యక్షతన సోమవారం మండలంలోని జీ-కన్వెన్షన్ హాల్‌లో ఎస్ఐఆర్‌పై నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి సారించి, ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువు, లక్ష్యానికి ముందుగానే నియోజకవర్గంలో తొలి దశ ప్రక్రియను పూర్తి చేశామని తెలిపారు. గతంలో కూడా ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించిన విషయాన్ని గుర్తు చేశారు. తుది ఓటర్ల జాబితాలో పేర్లు రాని వారు, డూప్లికేట్, డబ్లింగ్, మరణించిన వారి పేర్లకు సంబంధించిన అంశాలపై బీఎల్ఏ ఏజెంట్లు, గ్రామ శాఖ అధ్యక్షులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వివిధ కారణాలతో సుమారు 80 వేల మంది ఓటర్లకు నోటీసులు జారీ అయ్యాయని, నోటీసులు అందుకున్న వారికి అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించే విషయంలో బీఎల్ఏ ఏజెంట్లు, గ్రామ శాఖ అధ్యక్షులు, సర్పంచులుసహకరించాలని సూచించారు.

ప్రజాపాలనపై ప్రజల్లోకి వెళ్లాలి..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజాపాలనలో వెయ్యి రోజులు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే భూపతి రెడ్డి ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్‌లో అంతర్గత విభేదాలు కొనసాగుతున్నాయని, బీజేపీ కూడా ప్రజా సమస్యలపై కాకుండా రాజకీయ ప్రయోజనాలపైనే దృష్టి సారిస్తోందని విమర్శించారు. ఎస్ఐఆర్ నియోజకవర్గ పరిశీలకుడు జంగా రాఘవ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సామాన్య ప్రజల ప్రయోజనాల కంటే అదానీ, అంబానీలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, రాష్ట్ర గీతా పారిశ్రామిక సహకార కార్పొరేషన్ చైర్మన్ శేఖర్ గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు అంబర్ సింగ్, సర్పంచ్ ఫోరం నియోజకవర్గ అధ్యక్షులు వాసు, పార్టీ నాయకులు అమృతాపూర్ గంగాధర్, భాస్కర్ రెడ్డి, ఎర్రన్న, పొలసాని శ్రీనివాస్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, గ్రామ స్థాయి నాయకులు, బీఎల్ఏ ఏజెంట్లు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ భవేష్ మిశ్రా, ఇతర అధికారులు

రైల్వే ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్

సుభాష్‌నగర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేపట్టే రైల్వే ప్రాజెక్టుల కోసం అవసరమైన స్థల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. రైల్వే లైన్ల విస్తరణ, డబ్లింగ్, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి ఆయా జిల్లాలలో చేపట్టాల్సి ఉన్న భూ సేకరణ ప్రక్రియ విషయమై సీఎస్ సంజయ్ జాజు సోమవారం హైదరాబాద్ నుంచి రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి నిజామాబాద్ శివారులో బైపాస్ లైన్ కోసం భూసేకరణ ప్రక్రియ పురోగతిలో ఉందని కలెక్టర్ భవేష్ మిశ్రా సీఎస్ దృష్టికి తెచ్చారు. నిజామాబాద్ మీదుగా కొనసాగే ముత్కేడ్-మేడ్చల్ డబ్లింగ్ పనులకు కూడా భూసేకరణలో ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో రాజేంద్ర కుమార్, అధికారులు పాల్గొన్నారు.

ఒకరి మృతికి కారణమైన ముగ్గురికి పదేళ్ల జైలు

నిజామాబాద్ లీగల్, ఆగస్టు 31, (ఆంధ్రజ్యోతి): అనకూడని మాటలు మాట్లాడాడన్న కోపంతో ఓ మహిళ తన కుమారుడు, తమ్ముడితో కలిసి ఓ వ్యక్తిపై దాడి చేసి, అతని మృతికి కారణమైన కేసులో ముగ్గురికి పదేళ్ల చొప్పున కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000 చొప్పున జరిమానా విధిస్తూ మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి హరీష సోమవారం తీర్పు వెలువరించారు.

మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బిలోలి తాలూకా సావ్లీ గ్రామానికి చెందిన బింగేవార్ రాజమని తన కుమారుడు బింగేవార్ రాజు, బోసి గ్రామంలో నివసించే తన తమ్ముడు మాధవ్‌తో కలిసి బతుకుదెరువు కోసం నిజామాబాద్ నగరంలోని అర్సపల్లికి వలస వచ్చారు. వారు పనిచేసే ప్రదేశంలో సహచర కూలీగా ఉన్న తారాబాయి కుమారుడు చాంద్కే మాధవ్‌తో రాజమని కుటుంబానికి పరిచయం ఉండేది. 26 ఏప్రిల్ 2022న తారాబాయి కుమారుడు చాంద్కే మాధవ్ తన తల్లి రాజమని గురించి చెడుగా మాట్లాడాడు. ఈ విషయాన్ని కొంత దూరం నుంచి విన్న రాజమని నా గురించి మీ అమ్మతో తప్పుగా చెబుతావా అంటూ అతడిని బెదిరించింది. మరుసటి రోజు, 27 ఏప్రిల్ 2022న ఉదయం 7 గంటల సమయంలో అర్సపల్లి కమాన్ వద్ద టిఫిన్ చేసేందుకు వెళ్లిన చాంద్కే మాధవ్‌పై రాజమని, ఆమె కుమారుడు రాజు, ఆమె తమ్ముడు మాధవ్ కలిసి దాడి చేశారు. చేతులతో కొట్టి, కాళ్లతో తన్ని, రాయితో కొట్టి కిందపడేసి తీవ్రంగా గాయపరిచారు. తీవ్ర గాయాల కారణంగా చాంద్కే మాధవ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో చాంద్కే మాధవ్ మృతికి కారణ మైన బింగేవార్ రాజమని, బింగేవార్ రాజు, బింగేవార్ మాధవ్‌లకు పదేళ్ల చొప్పున కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల చొప్పున జరి మానా విధిస్తూ జడ్జి హ రిష తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలల జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. పోలీసుల తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నరసింహారెడ్డి కోర్టులో వాదనలు వినిపించారు.

టీయూ భూములను కాపాడాలి

- పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరికి వినతి

రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

డిచ్‌పల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీకి చెందిన విలువైన భూములను వ్యవసాయ కళాశాల నిర్మాణానికి కేటాయించే ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.అనిల్ కుమార్ మాట్లాడుతూ.. వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయడం స్వాగతించదగిన విషయమేనని అన్నారు. అయినప్పటికీ ఇప్పటికే ఉన్న తెలంగాణ యూనివర్సిటీకి చెందిన విలువైన భూములను కేటాయించడం మాత్రం సరైన నిర్ణయం కాదన్నారు. యూనివర్సిటీ భూములు భవిష్యత్‌లో విద్యార్థుల అవసరాలకు, కొత్త కోర్సులు, పరిశోధనా కేంద్రాలు, హాస్టళ్లు, ప్రయో గశాలలు, ఇతర విద్యా మౌలిక వసతుల విస్తరణకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీ ఇప్పటికే ఉన్నత విద్యను అందిస్తున్న ముఖ్యమైన ప్రభుత్వ విశ్వవి ద్యాలయమని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని

మిగతా 6వ పేజీలో...

చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీ ఆత్మహత్య

సైదాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రోడ్డు ప్రమాదం కేసులో రిమాండ్‌లో ఉన్న కంది సాగర్(31) జూలై 25న కంటి వైద్య చికిత్స నిమిత్తం నిజామాబాద్ జిల్లా జైలు నుంచి చంచల్‌గూడ జైలుకు తరలించారు. జైలు టెలిఫోన్ బూత్ నుంచి భార్యతో మాట్లాడాడు. అనంతరం వాష్‌రూంకు వెళ్లి ఉరి వేసుకున్నాడు. వెంటనే తోటి ఖైదీలు గమనించి జైలు అధికారులకు చెప్పారు. ఉస్మానియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై అధికారులు డబీర్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి సేవలను వినియోగించుకోవాలి
- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ 6

చెత్త నిర్వహణ
- పల్లెల్లో కానరాని పారిశుధ్య చర్యలు
- ఎడపల్లి మండలంలో 17 జీపీలు.. 55 వేలకుపైగా జనాభా
- పారిశుధ్య కార్మికులు ఉన్నా ఫలితం శూన్యం 4

క్రైం సమాచారం

చెరువులో దూకి ఆత్మహత్య

డిచ్‌పల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన కర్న భీరప్ప(51) చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు స్థానికులు తెలిపారు. సోమవారం ఉదయం రాంపూర్ చెరువులో భీరప్ప పడి ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదుచేశారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బోధన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరాజ్‌పల్లి గ్రామానికి చెందిన నర్సన్న(48) చికిత్స పొందుతూ మృతి చెందినట్టు బోధన్ రూరల్ ఎస్సై రాజేశ్వర్ తెలిపారు. ఈ నెల 24వ తేదీన తన ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించాడన్నారు. అతని భార్య విమల కుటుంబ సభ్యులతో కలిసి నిజామాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు ఎస్సై వివరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, కేసును దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

అటవీ భూమి ఆక్రమణ.. వ్యక్తి అరెస్టు

సిరికొండ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సిరికొండ రేంజ్ పరిధిలోని తాటిపల్లికి చెందిన బూక్యా మోహన్ అటవీ భూమి కబ్జా చేసి దున్నినందుకు అరెస్టు చేసి, కేసు నమోదు చేశామని రేంజ్ అధికారి నర్సింగ్‌రావు తెలిపారు. మోహన్‌ను తహసీల్దార్ రవీందర్‌రావు ఎదుట సోమవారం సాయంత్రం బైండోవర్ చేశామన్నారు. సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఇకముందు అటవీ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించవద్దని తహసీల్దార్ హెచ్చరిస్తూ వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా రేంజ్ అధికారి నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎలాంటి భూమిపై హక్కులు కల్పించకుండా లేదని దురాశతో అటవీ భూములను ఆక్రమించవద్దని ఆయన హెచ్చరించారు. భూములను ఆక్రమించినా, చెట్లు నరికివేసినా చట్ట కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని రేంజ్ అధికారి నర్సింగ్‌రావు హెచ్చరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బోధన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శక్కర్‌నగర్‌లో నివాసం ఉంటున్న మహమ్మద్ జహీరుద్దీన్ అనే వ్యక్తి ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడారని పోలీసులు తెలిపారు. ఈ నెల 24న కుటుంబ సభ్యులతో హైదరాబాద్ వెళ్లగా దొంగలు ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలతో పాటు ద్విచక్ర వాహనం సైతం ఎత్తుకెళ్లారన్నారు. సోమవారం ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పట్టణ సీఐ సీసీ ఫుటేజీల ద్వారా దర్యాప్తు చేపట్టారు.

పరారీలో ఉన్న మోసగాడి అరెస్టు

వేల్పూర్ , ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో విద్యా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ప్రజల నుంచి డబ్బులు వసూలుచేసి మోసం చేసిన జాన్కంపేట్‌కు చెందిన కొలిప్యాక ప్రవీణ్‌ను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. 2023లో ఆర్మూర్ పరిసర ప్రాంతాల్లో కొలిప్యాక ప్రవీణ్ పలువురిని మోసగించాడన్నారు. ఆయనపై చీటింగ్ కేసు నమోదైనప్పటి నుంచి పరారీలో ఉన్నారన్నారు. నమ్మదగిన సమాచారం మేరకు అతన్ని అరెస్టు చేసి రిమాండు నిమిత్తం కోర్టులో హాజరు పర్చామన్నారు. ప్రజలు బోగస్ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని ఎస్సై సూచించారు.

కారు, స్కూటీ చోరీ.. నిందితుడి రిమాండ్

ఇందూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని 2వ, 4వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కారు, స్కూటీని దొంగిలించిన అబ్దుల్ రహ్మాన్‌ఖాన్‌ను అరెస్టు చేసినట్లు 2వ టౌన్ పోలీసులు తెలిపారు. ప్రత్యేకంగా తనిఖీలు చేసి సీసీ కెమెరా ఆధారంగా దొంగను పట్టుకున్నామన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై యాదగిరి వివరించారు.

గణేష్ మండపాల వద్ద గుంతలు పూడ్చాలి

బోధన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గణేష్ మండపాల వద్ద గుంతలను పూడ్చాలని ఆటోనగర్ కాలనీవాసులు సోమవారం అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినాయకుల ప్రతిష్ఠాపన చేయడానికి తీసుకెళ్లేటప్పుడు రోడ్లంత గుంతలమయంగా ఉందన్నారు. దీని వల్ల ఇబ్బందులు తలెత్తే సమస్య ఉంటుందని పేర్కొన్నారు. కావున గణేష్ మండపాల వద్ద గుంతలను పూడ్చాలని కోరారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ మాట్లాడుతూ.. తప్పకుండా గుంతలను పూడ్చివేయిస్తామని, గణేష్ మండపాల వద్ద ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు.

పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి

ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఆర్మూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పేదలకే డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ఆర్మూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య మాట్లాడుతూ.. డబుల్ బెడ్‌రూంలు రాని పేదలకు ప్రభుత్వం ఇంటిస్థలం అందజేసి రూ.10 లక్షల రుణం మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న వారందరికీ పట్టాలు ఇచ్చి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. పట్టణంలో పేదలు సొంతిళ్లు లేక గత 30 ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో భూమన్న, రవి, నాగేష్‌గౌడ్, సాయిలు, విఠల్, అమీర్‌ఖాన్ పాల్గొన్నారు.

కోటగిరి: మండల కేంద్రంలో అసంపూర్తిగా మిగిలిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేసి నిరుపేదలకు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి విఠల్ గౌడ్ డిమాండ్ చేశారు. కోటగిరి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఎంపీడీవో విష్ణుకు వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వ హయంలో 120ఇళ్లు మంజూరు చేసినా కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలివేసి వెళ్లిపోవడం ఇంత వరకు ఎటువంటి పనులు ప్రారంభించకపోవడం సరికాదన్నారు. ఎమ్మెల్యే పనులను పూర్తి చేయించాలన్నారు. లేకపోతే ఆందోళనలు చేపడతామన్నారు. గంగాధర్, సాయిలు, రవి, రాజయ్య ఉన్నారు.

ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేయాలి

మోర్తాడ్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీలను బలోపేతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి ఎం.యాదగిరి మాదిగ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని విశ్రాంతి భవనంలో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా తెడ్డు సుమన్ మాదిగ, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడిగా కానర్ల మురళి మాదిగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రతీ మండలంలో కమిటీలను ఏర్పాటు చేయాలని బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి కనక ప్రమోద్ మాదిగ, ముఖ్య అతిథి యాదగిరి కోరారు. ఈనెల 9న చలో వరంగల్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ములిగె సుమన్, సాలమన్, గంగాధర్, గురవయ్య, నాగభూషణ్, తదితరులు పాల్గొన్నారు.

వివక్ష చూపితే శిక్షార్హులే

అవగాహన కల్పిస్తున్న ఆర్‌ఐ శంకర్

సాలూర, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): అంటరానితనం నేరమని, వివక్ష చూపిస్తేయితే శిక్షార్హులు అవుతారని సాలూర మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శంకర్ అన్నారు. పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా సోమవారం సాలంపాడ్ క్యాంప్ పంచాయతీలో అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ స్నేహ, సమానత్వం, సోదరభావంతో మెలగాలని సూచించారు. అంటరానితనాన్ని ప్రోత్సహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

- పల్లెల్లో కానరాని పారిశుధ్య చర్యలు
- ఎడపల్లి మండలంలో 17 జీపీలు.. 55 వేలకుపైగా జనాభా
- పారిశుధ్య కార్మికులు ఉన్నా ఫలితం శూన్యం
- దోమల విజృంభణ.. వ్యాధుల భయం
- ప్రజల్లో మార్పు వస్తేనే మేలు

చెత్త నిర్వహణ

ఎడపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో పారిశుధ్యం పడకేసింది. మండలంలో 17 గ్రామపంచాయతీలు, 55 వేలకుపైగా జనాభా ఉన్నా చెత్త తొలగింపు, మురుగు కాలువల శుభ్రత సక్రమంగా సాగడం లేదన్న విమర్శలు ఉన్నాయి. పారిశుధ్య కార్మికుల వేతనాలు, ట్రాక్టర్ల నిర్వహణకు ప్రతి నెలా లక్షల్లో ఖర్చు చేస్తున్నా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు.

పేరుకుపోయిన చెత్త కుప్పలు

మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ద్వారం, ప్రహరీ పక్కనే చెత్తకుప్పలు పేరుకుపోయాయి. చెత్తలో పశువులు సంచరిస్తుండగా దుర్గంధంతో విద్యార్థులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. రోడ్లపై నిలిచిన వర్షపు నీరు దోమల వృద్ధికి కారణమవుతోంది.

చెత్తలో కాగితాలు తింటున్న ఆవు

ఎక్కడ చెత్త అక్కడే..

కాలువల్లో నుంచి తీసిన చెత్తను సైతం అక్కడే వదిలేస్తుండటంతో పారిశుధ్యం మరింత అధ్వానంగా మారతోంది. ఇప్పటికే పలు గ్రామాల్లో డెంగీ బారినపడి పలువురు ఆస్పత్రుల పాలయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యంపై దృష్టి సారించాలి.

ప్రజల్లో చైతన్యం రావాలి..

మన ఆరోగ్యం మన చేతుల్లో ఉందని ప్రజలు గుర్తిస్తేనే పారిశుధ్య నివారణలో భాగస్వాములు అవుతారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడం మానుకోవాలి. తడి, పొడి చెత్తకు రెండు బకెట్లు ఏర్పాటు చేసుకొని తొలగించుకుంటే ఆరోగ్యం కాపాడుకోవడం సాధ్యమవుతుంది. చెత్త సేకరణకు వచ్చే ట్రాక్టర్‌లో చెత్త వేయాలి. చెత్తను రోడ్ల పక్కన పడేస్తూ పరిసరాలను ప్రజలే అపరిశుభ్రంగా మారుస్తున్నారు. ప్లాస్టిక్ కవర్ల వాడకం చాలా ప్రమాదమని తెలిసిన వాటినే వాడుతున్నారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజశేఖర్

ఏర్గట్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న జి.రాజశేఖర్ పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందినట్టు మండల అధ్యక్షుడు కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా మండల ప్రధానకార్యదర్శి ప్రవీణ్‌కర్, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులకు శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు.

నేడు రైతులకు శిక్షణ

ఏర్గట్ల, కమ్మర్‌పల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఏర్గట్ల రైతు వేదికలో మంగళవారం పసుపు సాగులో ఆధునాతన ఉత్పత్తి సాంకేతికతలపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ జి.విద్య ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు హాజరై సలహాలు సూచనలు పొందాలని కోరారు.

మానవత్వం చాటుకున్న ఆటో డ్రైవర్

ఫోన్‌ను బాధితుడికి అందజేస్తున్న ఎస్సై

ముప్కాల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలం వన్నెల్(బి)కి చెందిన ఆటో డ్రైవ్ సయ్యద్ ఇస్మాయిల్ మానవత్వాన్ని చాటుకున్నారు. తనకు దొరికిన మొబైల్ ఫోన్‌ను ఎస్సై శైలేందర్‌కు అందజేశారు. ఆదివారం రాత్రి చిట్టాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద తన ఆటోలో ప్రయాణికులను దింపిన తర్వాత రోడ్డు పక్కన పడి వున్న ఫోన్ కనిపించింది. ఇస్మాయిల్ ఫోన్‌ను తీసుకుని సోమవారం ముప్కాల్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించడంతో ఎస్సై శైలేందర్ ఆటో డ్రైవర్ ఇస్మాయిల్‌ను ప్రోత్సహించి బహుమతి అందజేశారు. అనంతరం మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్న వ్యక్తికి అప్పగించారు.

పుష్కరఘాట్ నిర్మించాలి

వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

నవీపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచ గోదావరిపై ఉన్న రోడ్డు బ్రిడ్జి పక్కన స్థలంలోనే నూతనంగా పుష్కర ఘాట్ నిర్మించాలని గ్రామస్థులు కోరారు. సోమవారం ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ అంకిత్‌కు వినతిపత్రం అందజేశారు. ఇతర స్థలంలో ఘాట్ నిర్మిస్తే తాము అంగీకరించమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు ఉన్నారు.

చెక్కుల అందజేత

చెక్కులను అందజేస్తున్న ఛైర్‌పర్సన్

భీమ్‌గల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పరిధిలోని 15 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఛైర్‌పర్సన్ బోదిరె నాగమణి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ గజానంద్, కౌన్సిలర్లు మమ్మద్ అంజుమీలి, సతీష్, నీలం రవి, నాయకులు నర్సయ్య, ఆర్‌పల్లి నాగేంద్రబాబు తదితరులున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెక్కులతో తులం బంగారాన్ని అందించాలని కాంగ్రెస్ నాయకుడు నీలం రవి కోరారు. అధికారంలోకి వచ్చి నేటికి 1000 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ అందించడం లేదన్నారు. హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

కంపోస్టు షెడ్లను వినియోగంలోకి తేవాలి

» బోధన్ డీఎల్‌పీవో నాగరాజు

రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో నాగరాజు

కోటగిరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కంపోస్టు షెడ్లను వినియోగంలోకి తీసుకురావాలని బోధన్ డీఎల్‌పీవో నాగరాజు సూచించారు. పోతంగల్ మండలంలోని హంగర్గ, సుంకిని గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఆయా పంచాయతీల్లో రికార్డులను పరిశీలించారు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన కంపోస్టు షెడ్లు వృథాగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కంపోస్టు షెడ్‌లలో తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువులను తయారు చేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఉదయ్ భాస్కర్, పాజీపటేల్ తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

మాట్లాడుతున్న ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ

ఆర్మూర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ అన్నారు. సోమవారం కృష్ణవేణి పాఠశాలలో మన కాలనీ, మన భద్రత, మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్‌పై చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, విద్యార్థులు మొబైల్ ఫోన్‌లకు దూరంగా ఉంటు చదువుపై ఏకాగ్రత నిలపాలని సూచించారు. విద్యార్థినులకు షీటీం సేవలపై వివరించి, ఆపద సమయంలో షీటీంకు ఫిర్యాదు చేసే క్యూఆర్ కోడ్ విధానాన్ని ఎస్‌హెచ్‌వో వివరించారు. బాల్కొండ ఎస్సై శైలేందర్ పేరెంట్ సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను వ్యసనాలకు బానిస కాకుండా తమను ఒక కంట కనిపెడుతూ ఉండాలని సూచించారు. రోజూ పిల్లల కోసం ఒక గంట సమయం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజియోద్దిన్, సూడెంట్ కౌన్సెలర్ రాజేష్, ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నదా మురళి పాల్గొన్నారు.

ముప్కాల్: బాల్కొండ ప్రభుత్వ కళాశాలలో

మండల ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

» అధికారులకు వినతిపత్రాలు సమర్పించిన ప్రజలు

» సమస్యలు పరిష్కరిస్తామని అధికారుల హామీలు

పోతంగల్‌లో ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్

నందిపేట, రెంజల్, కోటగిరి, ముప్కాల్, ఆర్మూర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఆయా మండలాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాలకు ప్రజలు పోటెత్తారు. అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నందిపేట మండలంలో 60 ఫిర్యాదులు అందాయి. ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీవో రాజేశ్వర్, ఏం ఈవో అవధూత గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ కార్మికులకు కేటాయించాలని ఎవీకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు గంగాధర్ వినతిపత్రం అందజేశారు.

● రెంజల్‌లో నాలుగు ఫిర్యాదులు స్వీకరించినట్టు ఎంపీడీవో కమలాకర్ తెలిపారు.

● కోటగిరిలో 15 ఫిర్యాదులు వచ్చినట్లు ఎంపీడీవో విష్ణు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు 7, భూ సమస్యలపై 6, విద్యుత్, రవాణాపై ఒకటి చొప్పున ఫిర్యాదులు వచ్చాయన్నారు. పోతంగల్‌లో 6 ఫిర్యాదులు వచ్చినట్టు ఎంపీడీవో చందర్ తెలిపారు.

● ముప్కాల్‌లో ఐదు దరఖాస్తులు వచ్చినట్టు ఎంపీడీవో రమేష్, తహసీల్దార్ ముతాజోద్దీన్ తెలిపారు. బాల్కొండలో 4 దరఖాస్తులను ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ స్వీకరించారు. ఇతర అధికారులు పాల్గొన్నారు.

● ఆర్మూర్ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో 9 ఫిర్యాదులు రాగా సబ్‌కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా స్వీకరించారు. పరిష్కారానికి ఆదేశించారు.

సమాజ సేవలో ముందుండాలి

బాలకిషన్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

వేల్పూర్,ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందిన వారు సమాజ సేవలో ముందుండాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. సోమవారం వేల్పూర్ ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించిన బాలకిషన్ సోమవారం ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఉద్యోగ రీత్యా నిత్యం ప్రజలతో సంబంధాలు కలిగి ఉన్న ఎంపీడీవో బాలకిషన్ ఇక ముందు కూడా కుటుంబానికి సమయం కేటాయిస్తునే ప్రజలకు మెరుగైన సమాజ సేవలో ఉండాలని సూచించారు. అంతకుముందు బాలకిషన్ దంపతులను ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీవో సాయన్న, ఉద్యోగులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల

భీమ్‌గల్ రూరల్: భీమ్‌గల్ మాజీ జడ్పీటీసీ సభ్యుడు, బీఆర్ఎస్ సీనియర్ నేత రవి తండ్రి అనారోగ్యంతో చనిపోయారు. సోమవారం రవి స్వగ్రామమైన బాబాపూర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొని మృతదేహానికి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మండల మహాజన సభలు

రుద్రూరు: మండల కేంద్రంలో సమాఖ్య అధ్యక్షురాలు అధ్యక్షతన సోమవారం మహాజనసభ నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బీ.రాధ, కార్యదర్శిగా గంగామణి, కోశాధికారి తబస్సుం బేగంను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షురాలు ప్రమీల, ఏపీఎం బసంత్ రావు, సీసీలు విఠల్, పులిసింగ్, అకౌంటెంట్ సుధ పాల్గొన్నారు.

మాక్లూర్: మండల సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా శ్రీకన్య, కార్యదర్శిగా అర్చన, కోశాధికారిగా సుమలతను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, ఐకేపీ ప్రసాద్, ఏపీఎం ఉమాకిరణ్ ఉన్నారు.

రిటైర్డ్ టీచర్‌కు సన్మానం

నవీపేట: నాళేశ్వర్ జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు బీసంజీవ రావు సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. పాఠశాలలో సంజీవ రావును శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ ఛైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, ఎంఈవో అశోక్, హెచ్ఎం శ్రీదేవి, సర్పంచ్ లావణ్య, ఉప సర్పంచ్ శ్రీనివాస్, ప్రకాష్‌రావు, రమణరావు, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: కోనాపూర్ ఉన్నత పాఠశాలలో ఉద్యోగ విరమణ పొందనున్న టీచర్ దర్పేందర్‌ను ఎంఈవో నేరళ్ల ఆంధ్య సర్పంచ్ రిక్కా అరుణ్ రెడ్డి, ఉప సర్పంచ్ ఉదయ్, ముప్కాల్ ఎంఈవో గంగారాం, హెచ్ఎం రాంప్రసాద్ తదితరులు సన్మానించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సాలూర: మండలంలోని మందర్నకు మంజీరా పరీవాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై ఎం.రాజేశ్వర్ తెలిపారు. ఇసుక ట్రాక్టర్‌పై కేసు నమోదు చేశామన్నారు.

ఆర్థికసాయం అందజేత

నవీపేట: మండల రజక సంఘం అధ్యక్షుడు కామయ్య మృతిచెందగా బాధిత కుటుంబానికి సోమవారం నవీపేట కు చెందిన కొండపల్లి హన్మంతు రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

న్యూస్ బాక్స్

కార్యదర్శిపై ఫిర్యాదు

నవీపేట: నవీపేట కార్యదర్శి నిబంధనలు బేఖాతర్ చేస్తున్నారని 5వ వార్డు సభ్యుడు చల్లా రవీందర్ మండల ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పంచాయతీ మాజీ అధ్యక్షురాలు సాధారణ సమావేశానికి సంబంధించి నోటీసు సరిగా అందించలేదన్నారు.

నిబంధనలను పాటించాలి

రెంజల్: ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై గంగాధర్ అన్నారు. సోమవారం మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఆయన వెంట సిబ్బంది ఆసిఫ్, వాజిద్ పాల్గొన్నారు.

కవిత దంపతుల పూజలు

నందిపేట: చౌడమ్మ కొండూర్‌లో రాజ్యలక్ష్మి సమేత శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో తెలంగాణ రక్షణ సేన ఆధినేత కల్వకుంట్ల కవిత, అనిల్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు నవీన్‌ఆచారి,మనోజ్, సంతోష్, దినేష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

వర్ని: జేకొయ్య క్యాంపు కేజీబీవీలో సోమవారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. జండిల్ వర్ని డివిజన్ ఆప్తాల్మిక్ రమేష్, మల్లయ్య ఉన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

మోర్తాడ్: శెట్‌పల్లిలో సర్పంచ్ పెగడ విజయ్ కుమార్ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఏఎంసీ డైరెక్టర్ రంజిత్, బి. సాయిరాం తదితరులున్నారు.

నందిపేట: చౌడమ్మ కొండూర్‌లో స్మార్ట్ రేషన్ కార్డులను సర్పంచ్ జంగిడి గోదావరి అందజేశారు. ఉప సర్పంచ్ బండారి సాయికుమార్, కార్యదర్శి అర్జున్, వార్డు సభ్యులు సంతోష్, పోశెట్టి, జీవీజ్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో రక్తదాన శిబిరం

ఆర్మూర్: పట్టణంలో సోమవారం గొట్టుముక్కుల సుమలత స్మారకార్థం రక్తదాన శిబిరం నిర్వహించారు. 20 మంది యువకులు రక్తదానం చేశారు. రవి, ప్రతాప్, రమణ, ప్రవీణ్, గంగాధర్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

ఆర్మూర్: ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌లను ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ అప్పగించారు. ఫోన్లు పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్‌లో గుర్తిస్తామన్నారు.

బస్సు సేవలు పునరుద్ధరించాలి

వర్ని: మోస్రా మండలంలోని బట్టాపూర్, ఏర్గట్ల, తాళ్లరాంపూర్, తడపాకల్ గ్రామాల మీదుగా నిర్మల్ వరకు నడిచే బస్సును యథావిధిగా బస్సు సేవలు పునరుద్ధరించాలని ప్రజాప్రతినిధులు కోరారు. దీనికి డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో బట్టాపూర్ సర్పంచ్ భూషణమేని ప్రవీణ్ యాదవ్, ఉపసర్పంచ్ మూడ్ దయానంద్ వీడీసీ సభ్యులు మెట్‌పల్లి డిపో మేనేజర్ హరిని కలిసి వినతిపత్రం అందజేశారు.

ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం

వేల్పూర్: మండలకేంద్రంలో ఇందిరమ్మ ఇంటిని కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రంగు అనిల్ గౌడ్, ఏలేటి రాజేందర్, రమణ, దామోదర్‌గౌడ్, రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బస్సులు నడిపించాలి

బోధన్: విద్యార్థుల సౌకర్యార్థం సమయానికి బస్సులు నడిపించాలని కళాశాల విద్యార్థులు కల్దుర్కిలో బస్సు ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిపో మేనేజర్ విశ్వనాథ్‌తో మాట్లాడారు. కల్దుర్కి, ఖండ్‌గావ్ తదితర గ్రామాల మైపు విద్యార్థుల సౌకర్యార్థం బస్సులను నడిపిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందవద్దని డిపో మేనేజర్ సూచించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

భీమ్‌గల్ రూరల్: సుదర్శన్‌నగర్ తండాలో అంబేద్కర్ విగ్రహాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ ఆవిష్కరించారు. సర్పంచ్ వసుందర్, కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్, అనంతరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

జక్రాన్‌పల్లి:రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని జక్రాన్‌పల్లి కాంగ్రెస్ నాయకులు కలిశారు. గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పోరం జిల్లాధ్యక్షుడు ఎం.చిన్నసాయిరెడ్డి, గడ్డం సంజయ్‌రెడ్డి, వినోద్, తిరుపతి, ఉదయ్, తదితరులున్నారు.

బాలానగర్‌లో హర్ ఘర్ జల్ కార్యక్రమం

జక్రాన్‌పల్లి: బాలానగర్‌లో హర్‌ఘర్‌జల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ కొమిరే రాజు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి వందశాతం తాగునీటిని అందిస్తున్నందుకు సర్పంచ్ కొమిరే రాజుకు ప్రభుత్వాన్ని అందించి అభినందించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి హారిక, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గుంత పూడ్చిన అధికారులు

నందిపేట: మాక్లూర్ మండలం వెంకటేశ్వరానగర్- గాలిపల్ నగర్ మధ్య నగర పోచమ్మ సమీపంలో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ఎదుట గుంతను అధికారులు పూడ్చారు.

ఘనంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవం

కోటగిరి: మండలకేంద్రంలోని వివేకానంద కాలనీలో ని వినాయక ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

AJ CLASSIFIEDS

CHANGE OF NAME

I, SAKALI KARRECHINNA SAILOO S/O SAKALI PEDDA SAYANNA (OLD NAME) R/O H.NO: 7-4, SIRNAPALLY, INDALWAI, NIZAMABAD.TG. I HAVE CHANGED MY NAME AS GANGADHAROLLA CHINNA SAILOO (NEW NAME) S/O GANGADHAROLLA PEDDA SAYANNA

AJZ

CHANGE OF NAME

I, K. SUVARNA D/O NARAYANA R/O H.NO. 8-105, ALOOR (V&M), NIZAMABAD (D) HAVE CHANGED MY NAME AS BOPPENA PURNIMA W/O BOPPENA VIJAY KUMAR

AJZ

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో విచారించుకోవలసినదిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకుల బ్యాంక్ ఖాతాల్లో ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారుని బాధ్యత వహించవలసివుంటుంది. లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవీటీ

-: సంప్రదించవల్సిన నెంబర్లు :- నిజామాబాద్ : 99484 06282, కామారెడ్డి : 9985411453

అందరివాడు ఆట ఆపేశాడు

ఫుట్‌బాల్‌తో పెద్దగా పరిచయం లేని వాళ్లు కూడా కాసేపు తన ఆట చూస్తే ఆ ఆటలో మజా ఏంటో అర్థమై ఆస్వాదించేలా చేయగల ఆకర్షణ కలిగినవాడు..
మైదానంలో పాదరసంలా కదలాడుతూ, అద్భుతమైన డ్రిబ్లింగ్ నైపుణ్యంతో ప్రత్యర్థుల గుండెల్లో దడ పుట్టించినవాడు..
కళ్లు చెదిరే ఫీల్డ్ గోల్స్‌తో ప్రపంచ రికార్డులు కొల్లగొట్టిన ఘనుడు..
తన మంత్రముగ్ధమైన ఆటతో యావత్ క్రీడాలోకాన్ని ఉర్రూతలూగించినవాడు..
మాటల్లో సౌమ్యుడు, చేతల్లో ఘనాపాఠిగా ఉంటూ అభిమానులకు అపరిమితమైన ఆనందాన్ని పంచిన అందరివాడు..
ఆటనే ప్రేమించి.. ఆటనే శ్వాసించి.. ఆటనే శాసించిన లియోనెల్ మెస్సీ.. ఇక చాలని సెలవు తీసుకొన్నాడు.

అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు మెస్సీ గుడ్‌బై

బ్యూనస్ ఎయిర్స్: అర్జెంటీనా ఫుట్‌బాల్ గ్రేట్ లియోనెల్ మెస్సీ (39) అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. రెండు దశాబ్దాలపాటు అర్జెంటీనాకు ప్రాతినిధ్యం వహించిన మెస్సీ.. జాతీయ జట్టుకు రిటైర్మెంట్ ప్రకటిస్తున్నట్టు సోమవారం స్పానిష్ భాషలో తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశాడు. రికార్డు స్థాయిలో దేశం తరపున ఆరు వరల్డ్‌కప్‌లు ఆడాడు. 2016లో కోపా కప్ ఫైనల్లో ఓటమి తర్వాత విమర్శలకు తట్టుకోలేక తొలిసారి రిటైర్మెంట్ ప్రకటించిన మెస్సీ.. అభిమానుల విజ్ఞప్తితో పునరాగమనం తర్వాత అంతా స్వర్ణయుగమే. మెస్సీ సారథ్యంలో 2022లో కతార్‌లో జరిగిన సాకర్ ప్రపంచకప్‌లో అర్జెంటీనాను విజేతగా నిలవగా.. 2026 మెగా టోర్నీ ఫైనల్లో స్పెయిన్ చేతిలో ఓడింది. అయితే, తుది పోరులో ఓడిన రెండు రోజుల తర్వాత తన రిటైర్మెంట్ లేఖను రాసినట్టు మెస్సీ తెలిపాడు. కానీ, తన తండ్రి జార్జ్ మెస్సీ అనారోగ్యం, ఆయన మృతి కారణంగా బహిర్గతపర్చడానికి సమయం తీసుకొన్నట్టు తెలిపాడు. కాగా, క్లబ్ సాకర్‌లో లియోనెల్ మరికొంత కాలం కొనసాగే అవకాశం ఉంది. ప్రస్తుతం అతడు ఇంటర్ మయామి కెప్టెన్‌గా ఉన్నాడు. మరో రెండేళ్లపాటు ఆ క్లబ్‌తో అతడికి అగ్రిమెంట్ ఉంది.

'ఫైనల్ ముగిసిన ఇన్ని రోజుల తర్వాత, ఎంతో ఆలోచించిన తర్వాత, జాతీయ జట్టుకు రిటైర్మెంట్ ప్రకటించాలనే నా నిర్ణయాన్ని మీకందరికి తెలియజేస్తున్నా. ఇది ఎంతో బాధ కలిగించే నిర్ణయమే అయినా.. అందుకు ఇదే సరైన సమయమని భావిస్తున్నా. అర్జెంటీనా జెర్సీ కోసం సర్వస్వం ధారపోశా. జట్టుతో కలసి దేశానికి ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందించా. అర్జెంటీనా ప్రజలను గర్వపడేలా చేయడం ఎప్పుడూ ఆనందమే. ఇక, సమయం తరిగిపోతుంది. కొన్ని అధ్యాయాలు ముగిసిపోనున్నాయి.

సర్వం ధారపోశా..
లియోనెల్ భావోద్వేగ లేఖ

దేశానికి ప్రాతినిథ్యం వహించడం నాకు ఎంతో ఇష్టం. నా దగ్గర ఉన్నదంతా ఇచ్చేశా. ఇక నా వద్ద ఏమీ మిగల్లేదు. ఎంతో మంది ప్రతిభగల యువ ఆటగాళ్లు దూసుకొస్తున్నారు. వారికి ఇదే తగిన సమయం. 20 ఏళ్లుగా అందించిన ప్రేమ, అభిమానానికి కృతజ్ఞతలు. ఇకపై జాతీయ జట్టుకు బయట నుంచి అభిమానించే వ్యక్తిగా ఉంటా. కుటుంబం, కోచ్, సహచరులు, జట్టు అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు. చిరస్మరణీయ జ్ఞాపకాలను నాతో తీసుకెళ్తున్నా. నా సహచరులతో కలసి ఒకప్పుడు కలలు కన్న క్షణాలను.. మీకు అందించామనే సంతృప్తితో సగర్వంగా నిష్క్రమిస్తున్నా. అర్జెంటీనావాడిగా నన్ను పుట్టించినందుకు దేవుడికి కృతజ్ఞతలు. లెట్స్ గో అర్జెంటీనా..'

– లియోనెల్ మెస్సీ



యుగానికొక్కడు

ఎదుగుదల లోపంతో ఏమైపోతాడో? అనుకొన్నవాడు.. తన ఆటతో రెండు దశాబ్దాలపాటు కోట్లాది మంది అభిమానుల హృదయాలను కొల్లగొట్టాడు. కష్టాలకు ఎదురీదాడు.. పట్టుదలతో పోరాడాడు.. ఓర్పుతో నేర్చాడు.. సాకర్ చరిత్రలో మహోన్నత శిఖరంగా నిలిచాడు.

ఓ శకం ముగిసింది!

మెస్సీ మేనియా దాదాపు రెండు దశాబ్దాలపాటు ప్రపంచాన్ని ఊపేసింది. బార్సిలోనా తరపున మెరుపులు మెరిపించిన మెస్సీ.. 2004లో అర్జెంటీనా అండర్-20 జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. అప్పుడు అతడి ఆట విశ్లేషకులను ఎంతగానో ఆకట్టుకొంది. 2005లో 18 ఏళ్ల వయసులో జాతీయ జట్టులోకి వచ్చిన లియోనెల్.. క్రమంగా జట్టు మూలస్తంభంగా మారాడు. 2006 ప్రపంచ కప్‌లో తొలిసారి అర్జెంటీనాకు ప్రాతినిధ్యం వహించాడు. 2009లో జువాన్ రోమన్ రిక్వెల్మీ రిటైర్మెంట్‌తో నెం:10 జెర్సీ మెస్సీకి వచ్చింది. ఇక, 2010 ఫిఫా వరల్డ్‌కప్ అర్జెంటీనా జట్టును మెస్సీ కేంద్రంగా కోచ్ మారడోనా తయారు చేశాడు.

చేదు అనుభవాలు..

జాతీయ జట్టు అర్జెంటీనా తరపున మాత్రం ఎన్నో చేదు అనుభవాలు. 2007 కోపా కప్‌లో ఓటమి.. 2014 వరల్డ్‌కప్ ఫైనల్లో ఓటమి మెస్సీని తీవ్ర నిరుత్సాహానికి గురి చేసింది. 2015, 2016 కోపా కప్‌లో కూడా పరాజయాలతో.. తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు. అతడిని జట్టు నుంచి తప్పించాలనే డిమాండ్ బలంగా వినిపించింది. తల్లడిల్లిపోయిన లియోనెల్ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలికాడు.

శూన్యం నుంచి..

మెస్సీ దూరం కావడంతో ఒక్కసారిగా అర్జెంటీనా జట్టులో శూన్యం ఆవరించింది. తట్టుకోలేక పోయిన ఫ్యాన్స్.. మళ్లీ తిరిగి రావాలని కోరారు. అభిమానుల కోరికను మెస్సీ మన్నించడం అతడి జీవితంలో.. కెరీర్‌లో ఓ మేలి మలుపు. ఎక్కడైతే పోగొట్టుకొన్నారో.. అక్కడే వెతుక్కోమన్నట్టుగా రీఎంట్రీలో మెస్సీ తనను తాను సరికొత్తగా ఆవిష్కరించుకొన్నాడు. 2021లో మరకాన స్టేడియంలో కోపాకప్‌ను అతడు ముద్దాడడం ఫుట్‌బాల్ చరిత్రలోనే భావోద్వేగ సందర్భం. అర్జెంటీనాకు ట్రోఫీ అందించడంతో అతడికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు.

'ఎడారి'లో దాహం తీరింది..

2022 కతార్‌లో జరిగిన ఫిఫా వరల్డ్‌కప్.. ఒక రకంగా మెస్సీకి చివరి అవకాశం అని భావించారు. మెగా టోర్నీ తొలి మ్యాచ్‌లోనే సౌదీ అరేబియా చేతిలో ఓటమి. ఇంత గొప్ప ఆటగాడి కెరీర్ వరల్డ్‌కప్‌ను అందుకోకుండానే ముగుస్తుందా? అనే నిర్వేదం. కానీ, డీలా పడిన జట్టులో స్ఫూర్తిని రగిల్చిన మెస్సీ.. వరుస విజయాలతో జట్టును ఫైనల్‌కు చేర్చాడు. ఫ్రాన్స్‌తో టైటిల్

ఫైట్‌లో డ్రామా నడిచినా.. షూటౌట్‌లో అర్జెంటీనాను గెలిపించిన మెస్సీ.. 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్'గా తనపేరును చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించుకొన్నాడు. 2024లో మెస్సీ సారథ్యంలో అర్జెంటీనా మరోసారి కోపా అమెరికా కప్ విజేతగా నిలవగా.. 2026 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంప్‌గా బరిలోకి దిగిన అర్జెంటీనాను లియోనెల్ మరోసారి ఫైనల్‌కు చేర్చాడు.

హైదరాబాద్‌తో అనుబంధం

భారత పర్యటనలో భాగంగా గత ఏడాది డిసెంబరు 13న మెస్సీ హైదరాబాద్‌కు విచ్చేశాడు. మెస్సీ రాకను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం అతడికి ఘన స్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు చేసి.. ఔరా అనిపించింది. ఫలక్‌నుమా ప్యాలెస్‌లో బస చేసిన మెస్సీ తొలుత అక్కడ కొద్ది మంది అభిమానులతో ఫొటోలు దిగాడు. అనంతరం ఉప్పల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన స్నేహపూర్వక ఫుట్‌బాల్ మ్యాచ్‌లో సీఎం రేవంత్ రెడ్డితో కలిసి మెస్సీ కొద్దిసేపు ఆడడం ఈ పర్యటనకే హైలైట్‌గా నిలిచిపోయింది. ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు పలువురు సెలెబ్రిటీలు ఉప్పల్ స్టేడియానికి తరలి వచ్చారు. మ్యాచ్ అనంతరం మెస్సీ స్టేడియం మొత్తం తిరుగుతూ తన కోసం వచ్చిన అభిమానులకు అభివాదం చేశాడు. ఆతర్వాత స్టేడియంలోనే యువ క్రీడాకారులతో కొద్దిసేపు ముచ్చటించి, వారికి కొన్ని సలహాలు కూడా ఇచ్చాడు.

మీ ఆట.. ప్రపంచానికి ప్రేరణ సీఎం రేవంత్

మెస్సీ రిటైర్మెంట్‌పై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. 'మీరు ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ ప్రేమికులను ఉర్రూతలూగించారు.. స్ఫూర్తినిచ్చారు. మీతో కలిసి ఫుట్‌బాల్ మైదానంలో కొన్ని నిమిషాలు గడపడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. మీరు లేని ఫుట్‌బాల్ మునుపటిలా ఉండదు. వీడ్కోలు పలికినా.. మీ స్ఫూర్తి మరెందరినో ప్రేరేపిస్తూనే ఉంటుంద'ని రేవంత్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

కుటుంబం..

మెస్సీ తన చిన్ననాటి స్నేహితురాలు ఆంటోనెలా రొకుజోను కొన్నాళ్ల సహజీవనం అనంతరం 2017 జూలైలో పెళ్లాడాడు. వారికి ముగ్గురు సంతానం. పెద్దకొడుకు థియాగో మెస్సీ 2012లో, రెండో కుమారుడు మాటెయో మెస్సీ 2015లో, మూడో కొడుకు సిరో మెస్సీ 2018లో జన్మించారు. ఇక మెస్సీ తండ్రి జార్జ్ ఈ మధ్యే మృతిచెందారు. మెస్సీకి తల్లి, ఇద్దరు అన్నలు, ఓ చెల్లెలు ఉన్నారు.

మారడోనాతో..

ఆటను శాసించాడు

అలనాటి దిగ్గజం పీలే, తరువాతి తరం హీరో డీగో మారడోనా..ప్రస్తుత స్టార్ క్రిస్టియానో రొనాల్డోను కాదని లియోనెల్ మెస్సీయే సాకర్ 'ఆల్‌టైమ్ గ్రేట్' అనేందుకు లెక్కకు మిక్కిలి ఉదాహరణలున్నాయి..రెండు నెలల కిందట జరిగిన ప్రపంచ కప్ ఫుట్‌బాల్ టోర్నీలో మెస్సీ చేసిన మాయాజాలాన్ని మరువగలమా ! మెగా టోర్నమెంట్‌లో కెప్టెన్‌గా ఒంటిచేత్తో జట్టుకు విజయాలు అందించాడు..అల్జీరియాతో ఆరంభ మ్యాచ్‌లో హ్యాట్రిక్‌తో అదరగొట్టాడు..ఆస్ట్రియాపై రెండు గోల్స్‌తో అద్భుతం చేశాడు..మెగా టోర్నీలో అత్యధికంగా 18 గోల్స్‌తో ఆల్‌టైమ్ గ్రేట్‌గా సరికొత్త చరిత్ర సృష్టించాడు.. జోర్డాన్‌తో పోరులో కళ్లు చెదిరే ఫ్రీకిక్‌తో కొట్టిన గోల్‌ను ఏమని వర్ణించగలం ? ప్రీక్వార్టర్స్‌లో ఈజిప్టుతో, క్వార్టర్స్‌లో స్విట్జర్లాండ్‌తో, సెమీఫైనల్లో ఇంగ్లండ్‌తో నరాలు తెగే ఉత్కంఠభరిత మ్యాచ్‌లలో జట్టును నడిపించి, గెలిపించిన తీరు మెస్సీకే చెల్లు..

అంతర్జాతీయ పోటీలలో ఇకపై లియోనెల్ మెస్సీ మెరుపులను చూడలేకపోవచ్చు. కానీ క్లబ్ సాకర్‌లో 39 ఏళ్ల అర్జెంటీనా సూపర్ స్టార్ ఆటను కనులారా వీక్షించవచ్చు. రెండు దశాబ్దాల తన కెరీర్‌లో ఫుట్‌బాల్‌ను మరో స్థాయికి తీసుకెళ్లిన ఘనత మెస్సీది. స్వయంగా గోల్స్ కొట్టడంలో ఎంత మేటో..సహచరులు గోల్స్ సాధించేలా అవకాశాలు సృష్టించడంలో మెస్సీ అంతకు మించిన మొనగాడు. ఫుట్‌బాల్ ప్రపంచాన్ని ఊపేసిన మెస్సీ..అసలు సాకర్‌కే పనికిరాడని స్వస్థలం రొసారియో కోచ్‌లు పొమ్మన్నారు. 'పొట్టిగా ఉన్నావు. ఈ ఆటకేం సరిపోతావు' అని ఎద్దేవా చేశారు. పైగా..11 ఏళ్ల వయసులో హార్మోన్ ఎదుగుదల లోపం బయటపడడం మెస్సీకి ప్రతికూలమైంది. కానీ అమ్మమ్మ సెలియా ఒలివేరాకు మనవడు మెస్సీ ప్రతిభపై ఎనలేని నమ్మకం. ఆ విశ్వాసంతో కోచ్‌లను ఒప్పించి మనవడికి శిక్షణ ఇప్పించింది. ఈ తరుణంలో అమ్మమ్మ మరణించడం అతడిని తీరని విషాదంలోకి నెట్టింది. అయితే తనను గొప్ప సాకర్ ఆటగాడిగా చూడాలన్న అమ్మమ్మ స్వప్నం నెరవేర్చే లక్ష్యంతో మెస్సీ ఆ విషాదాన్ని దిగమింగాడు. లియోనెల్ సాకర్ స్టార్‌గా ఎదగడంలో బార్సిలోనా క్లబ్‌ది కీలక పాత్ర. మిగతా క్లబ్‌లన్నీ నో చెప్పిన వేళ..మెస్సీని తమ క్లబ్‌లో చేర్చుకొని అతడి అనారోగ్యానికి చికిత్స ఇప్పించడంతోపాటు సాకర్ ప్లేయర్‌గా తీర్చిదిద్దింది. 2004లో 17 ఏళ్ల వయస్సులో బార్సిలోనా తరపున పోటీ సాకర్‌లోకి అడుగుపెట్టిన మెస్సీ, 2005లో హంగేరి జట్టుపై అర్జెంటీనాకు అరంగేట్రం చేశాడు. ఆపై ప్రపంచ ఫుట్‌బాల్‌పై చెరగని ముద్ర వేశాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

కెరీర్ ఘనతలు..

- అర్జెంటీనా జాతీయ జట్టు తరఫున 207 మ్యాచ్‌ల్లో 125 గోల్స్ చేశాడు.
- 8 సార్లు బాలన్ డీ ఓర్ అవార్డులు.
- తన కెప్టెన్సీలో అర్జెంటీనాకు ఓ ప్రపంచ కప్ (2022).
- తన సారథ్యంలో రెండు కోపా అమెరికా టైటిళ్లు (2021, 2024).
- ఒలింపిక్ క్రీడల (2008 బీజింగ్) స్వర్ణం.
- ఆరుసార్లు యూరోపియన్ గోల్డెన్ బూట్ అవార్డు.
- అత్యధిక మ్యాచ్‌లకు (133) కెప్టెన్సీ ఘనత.
- పది పర్యాయాలు హ్యాట్రిక్ గోల్స్.

అచ్చం సచిన్‌లాగే!

క్రికెట్ దిగ్గజం సచిన్‌కు, ఫుట్‌బాల్ గ్రేట్ మెస్సీల ప్రపంచకప్ విజయాల్లో కొన్ని పోలికలున్నాయి. సచిన్ పదో నెంబర్ జెర్సీని ధరిస్తే.. మెస్సీది కూడా అదే నెంబర్ జెర్సీ. 2003 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఓటమిపాలైన సచిన్.. ఎనిమిదేళ్ల తర్వాత 2011లో విశ్వకప్‌ను అందుకున్నాడు. అలాగే 2014 ప్రపంచకప్ తుది పోరులో రన్నరప్‌నకు పరిమితమైన మెస్సీ.. సరిగ్గా ఎనిమిదేళ్ల అనంతరం 2022లో విశ్వవిజేతగా నిలిచాడు. ఇలా, వేర్వేరు క్రీడల్లో ఇద్దరు అత్యుత్తమ ఆటగాళ్ల మధ్య పోలికలుండడం విశేషమే కదా!

హార్దిక్, నితీశ్ ఫిట్!

సుందర్ కూడా ● అఫ్ఘాన్‌తో టీ20 సిరీస్‌కు సిద్ధం

హార్దిక్

బెంగళూరు: అఫ్ఘానిస్థాన్‌తో టీ20 సిరీస్‌కు ముందు భారత్‌కు శుభవార్త. గాయాలతో బాధపడుతూ పునరావాస శిబిరంలో ఉంటున్న హార్దిక్ పాండ్యా, నితీశ్ కుమార్, వాషింగ్టన్ సుందర్ కోలుకుంటున్నారు. జట్టు ఎంపిక కోసం జాతీయ సెలెక్టర్లు ఈ వారంలో సమావేశం కానున్నారు. ఈనేపథ్యంలో హార్దిక్, నితీశ్ పేర్లను పరిగణనలోకి తీసుకోనున్నారు. హార్దిక్ తన మకాంను ముంబై నుంచి బెంగళూరుకు మార్చిన విషయం తెలిసిందే. అటు ప్రస్తుతం చెన్నైలో ఉన్న సుందర్ జట్టు సెలెక్షన్‌కన్నా ముందే సీఓఈలో ఫిట్‌నెస్ టెస్టుకు హాజరయ్యే అవకాశం ఉంది.

ఆసియా క్రీడలకు బుమ్రా: అఫ్ఘాన్‌తో సిరీస్‌కు బుమ్రా అందుబాటులో ఉండేది సందేహంగా మారింది. గాయం నుంచి కోలుకుంటున్న అతను ప్రస్తుతం సీఓఈలోనే ఉన్నాడు. అయితే ఆసియాకప్‌నకు బుమ్రా ఎంపికయ్యే అవకాశం ఉందని బోర్డు వర్గాలు పేర్కొన్నాయి.

జొకోకు ఝలక్



తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం

మరీనో నవోన్

అర్జెంటీనా యువ ఆటగాడి చేతిలో ఓటమి ● యూఎస్ ఓపెన్

న్యూయార్క్: యూఎస్ ఓపెన్‌లో పెను సంచలనం నమోదైంది. నాలుగో సీడ్ నొవాక్ జొకోవిచ్ (39)కు తొలి రౌండ్‌లోనే షాక్ తగిలింది. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ మొదటి రౌండ్‌లో జొకో 6-7(5), 7-5, 6-4, 2-6, 1-6తో మరీనో నవోన్ (అర్జెంటీనా) చేతిలో ఐదుసెట్లపాటు పోరాడి ఓడాడు. 4 గంటల 36 నిమిషాలపాటు సాగిన మారథాన్ మ్యాచ్‌లో జొకో కండరాల నొప్పులతో తీవ్రంగా ఇబ్బందులు పడ్డాడు. అంతేకాకుండా మ్యాచ్ ముగిసిన తర్వాత కన్నీటిపర్యంతమయ్యాడు. యూఎస్ ఓపెన్‌లో నొవాక్ తొలిరౌండ్‌లోనే వెనుదిరగడం అతడి కెరీర్‌లో ఇదే మొదటిసారి. మరోవైపు 25 ఏళ్ల నవోన్ కెరీర్‌లో ఈ ఏడాదే తొలి ఏటీపీ టైటిల్ నెగ్గాడు. ఇతర మ్యాచ్‌ల్లో 15వ సీడ్ అలెగ్జాండర్ బబ్లిక్ (కజకిస్థాన్) 6-4 6-2, 3-6, 6-1తో జె ఉల్ఫ్ (అమెరికా)పై, జైమ్ ఫరియా 6-3, 7-6(4), 4-6, 1-6, 6-2తో జాన్సన్ బ్రూక్స్‌బైపై గెలిచారు. మహిళల సింగిల్స్‌లో 9వ సీడ్ ఎలెనా స్విటోలినా 6-1, 6-2తో సోలాన్ సియర్రా (అర్జెంటీనా)ను, కరోలినా ప్లిస్కోవా (చెక్) 2-6, 7-5, 6-3తో హన్నే వాండవింకిల్‌ను, 18వ సీడ్ ఎకటరీనా అలెగ్జాండ్రోవా 6-2, 6-2తో మెకార్తీ కెస్లర్‌ను ఓడించారు. కాగా, వీనస్ విలియమ్స్ 2-6, 6-7(6) సోఫియా కెనిన్ చేతిలో పరాజయం పాలైంది.

వైభవ్ సెంచరీ మిస్

దులీప్ ట్రోఫీ

ఈస్ట్‌జోన్ 266 ఆలౌట్
నార్త్‌పై తిలక్‌వర్మ శతకం

వైభవ్ (92)

బెంగళూరు: ఈస్ట్‌జోన్ వైస్ కెప్టెన్ వైభవ్ సూర్యవంశీ దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో చెలరేగాడు. ఎడాపెడా షాట్లతో తన శైలిలో పరుగులు రాబట్టాడు. అయితే కొద్దిలో శతకం కోల్పోయాడు. సెంట్రల్ జోన్‌తో మ్యాచ్‌లో..సోమవారం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఈస్ట్‌జోన్ 266 పరుగులకు ఆలౌటైంది. వైభవ్ (81 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్స్‌లతో 92), మరో ఓపెనర్ అభిమన్యు (69) మొదటి వికెట్‌కు 161 పరుగులు జోడించారు. ఆపై సెంట్రల్‌జోన్ బౌలర్లు విజృంభించడంతో ఈస్ట్‌జోన్ 266 పరుగులకే చేతులెత్తేసింది. సెంట్రల్‌జోన్ మొదటి ఇన్నింగ్స్‌లో 266 రన్స్ చేసిన విషయం విదితమే. అనంతరం రెండో ఇన్నింగ్స్ చేపట్టిన సెంట్రల్‌జోన్ రెండో రోజు ఆఖరికి 45/3తో ఆడుతోంది.

సూర్యవంశీ రికార్డు పుటల్లో: అతి పిన్న వయస్సు (15 సంవత్సరాల 157 రోజులు)లో దులీప్ ట్రోఫీలో అర్ధ శతకం సాధించిన బ్యాటర్‌గా వైభవ్ రికార్డుల కెక్కాడు. ఈక్రమంలో 57 ఏళ్లనాటి(1969) లక్ష్మణ్ సింగ్ (16 ఏళ్ల 23 రోజులు) పేరిట ఉన్న రికార్డును దాటేశాడు.

తిలక్ వర్మ (106 బ్యాటింగ్)

సౌత్‌జోన్ 285/9: కెప్టెన్ తిలక్ వర్మ (106 బ్యాటింగ్) శతకబాదడంతో నార్త్‌జోన్‌తో సెమీఫైనల్లో సౌత్‌జోన్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం అందుకుంది. కిందటి రోజు స్కోరు 40/2తో సోమవారం, మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన సౌత్‌జోన్ ఆట ముగిసే సరికి 285/9 పరుగులు చేసింది. తిలక్, గోపాల్ (87) ఆరో వికెట్‌కు 175 పరుగులు జోడించారు. నార్త్‌జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 195 పరుగులకే ఆలౌటైన సంగతి తెలిసిందే.

బరిలో లక్ష్య, సాత్విక్ జోడీ

చైనా మాస్టర్స్ నేటి నుంచి

షెన్‌ఝెన్: వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో అనామక ఆటగాడి చేతిలో కంగుతిన్న ఏస్ షట్లర్ లక్ష్య సేన్ మంగళవారం నుంచి జరిగే చైనా మాస్టర్స్‌లో టైటిలే లక్ష్యంగా బరిలోకి దిగనున్నాడు. శ్రీకాంత్ కూడా బరిలో నిలవనున్నాడు. మహిళల సింగిల్స్‌లో ఉన్నతి హుడా, తన్వీ శర్మ, దేవిక సిహాగ్ సత్తా చాటాలనుకొంటున్నారు. డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి, అర్జున్-హరిహరన్, మిక్స్‌డ్‌లో కపిల-తనీషా, రోహన్ కపూర్-రుత్విక జోడీలు ఆడనున్నాయి.

పారా ప్యాడ్లర్ల పతక మోత

న్యూఢిల్లీ: ఫిన్లాండ్ జరిగిన పారా టేబుల్ టెన్నిస్‌లో భారత ఆటగాళ్లు 16 పతకాలతో దుమ్ము రేపారు. 6 స్వర్ణ, 4 రజత, 6 కాంస్యాలతో పోటీలను ఘనంగా ముగించారు. సింగిల్స్ విభాగాలలోనే 10 పతకాలు కొల్లగొట్టారు. డబుల్స్‌లో 2 స్వర్ణ, ఒక రజత, 3 కాంస్యాలు లభించాయి.

సావిత్రీబాయి పూలే స్ఫూర్తితో పనిచేస్తా

(3వ పేజీ తరువాయి)

ప్రశాంత్‌రెడ్డిని జీవితంలో క్షమించబోనని, తన ఉసురు ఆయనకు ఖచ్చితంగా తగులుతుందని అన్నారు. బీఆర్‌ఎస్ ఓడిపోయిన రెండవ రోజే కాంగ్రెస్‌లోకి వెళ్లే ప్రయత్నం ప్రశాంత్‌రెడ్డి చేశారని ఆమె విమర్శించారు. తాను 2019లో జిల్లాలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను గెలిపించేందుకు కష్టపడితే కుట్రచేసి తనను ఎంపీగా ఓడించారన్నారు. ప్రశాంత్‌రెడ్డి గెలిచి మంత్రి అయ్యాడని ఇక బాల్కొండలో ఆయన రాజకీయం మానేసుకోవాలని, అక్కడ నుంచి పారిపోవాలని వెంటపడి ఓడిస్తానన్నారు. సారంగపూర్ షుగర్ ఫ్యాక్టరీ తెరిపించేందుకు చేస్తున్న పోరాటానికి తన మద్దతు ఉంటుందన్నారు. అవసరమైతే పోరాటం చేస్తానన్నారు. పదేళ్లు బీఆర్‌ఎస్‌కు అధికారం ఇస్తే జీవన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, బాజిరెడ్డి, గణేష్‌గుప్త, షకీల్ ఎం వెలగబెట్టారని, మళ్లీ ఎందుకు వారికి అవకాశం ఇవ్వాలో జవాబు చెప్పాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు పదేళ్లు దోచుకున్న డబ్బులను ఇంకా లెక్కపెడుతున్నారని టీఆర్‌ఎస్‌లకు వచ్చే నాయకులను బెదిరిస్తున్నారని బెదిరిస్తే భయపడే రోజులు పోయాయన్నారు.

జిల్లాలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రతిపక్ష పాత్ర పోషించడంలేదని ఎందుకు ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలేదో జవాబు చెప్పాలన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీని నిలదీయాల్సిన జిల్లా బీఆర్‌ఎస్ నాయకులు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి చేస్తున్న ఇటుక వసూళ్లు, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ కాంగ్రెస్ నేతలతో చేస్తున్న కుమ్మక్కు రాజకీయాలన్ని బయటపెడతామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఐదు అసెంబ్లీ స్థానాల్లో గెలుస్తామని రాబోయే ఎంపీటీసీ, జడ్పీటిసి ఎన్నికల్లో పోటీ చేస్తామన్నారు. మాధవనగర్ బ్రిడ్జి విషయంలో తాను ఎంపీగా ఉన్నపుడు ప్రశ్నించిన ప్రస్తుత ఎంపీ అరవింద్ ఇప్పుడు ఏం చేస్తున్నాడని ప్రశ్నించారు. అప్పుడు తాను కేకే ట్యాక్స్ వసూలు చేశానని చెప్పారని ఇప్పుడు ఆయన ఏం ట్యాక్స్ వసూలు చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. పసుపు బోర్డు కేవలం బోర్డు మాత్రమేనని దాని వల్ల జిల్లా రైతులకు పైసా మేలు జరగలేదని ఆమె విమర్శించారు. ఈ సభలో పార్టీ నాయకులు రఘు, ఎస్‌ఏ అలీం, నవీనాచారి, నవీన్‌రెడ్డి, మౌనికారెడ్డి, విజయలక్ష్మి, ప్రవీణ్, అవంతి, లక్ష్మినారాయణ భరద్వాజ్, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కార్యకర్తలు బోనాలతో స్వాగతం పలికారు.

నాలుగు దశాబ్దాల గంగారాం సేవలు అభినందనీయం

- ప్రభుత్వ ఉద్యోగిగా.. టీఎన్జీవోస్ నేతగా విశేష కృషి
- మలి దశ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర
- పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

గైని గంగారాం దంపతులను సన్మానిస్తున్న పీసీసీ అధ్యక్షుడు

సుభాష్ నగర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగిగా సుమారు నాలుగు దశాబ్దాల పాటు సేవలందించిన గైని గంగారాం సేవలు అభినందనీయమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ కొనియాడారు. ప్రస్తుతం ఎస్సారెస్పీ సూపరింటెండెంట్, ఎగ్జిక్యూటీవ్ ఎస్సారెస్పీ ఇంజినీర్‌గా సేవలందిస్తున్న ఆయన సోమవారం పదవీ విరమణ చేశారు కార్యక్రమానికి పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో టీఎన్జీవోస్ అధ్యక్షుడిగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి గంగారాం ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. 39 సంవత్సరాలుగా ప్రభుత్వానికి సేవలందిస్తూ వివిధ హోదాల్లో పనిచేసిన గంగారాం.. తనకు అప్పగించిన ప్రతి బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించారని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు సుమన్, గోపాల్ శర్మ, వి.ప్రభాకర్ పాల్గొన్నారు

బాధిత కుటుంబానికి పరామర్శ

డిచ్‌పల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలం ధర్మారం(బి) గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సుంకరి దావీద్ కుటుంబాన్ని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి పరామర్శించారు. ఇటీవల దావీద్ సతీమణి అనారోగ్యంతో మరణించగా ఎమ్మెల్యే పరామర్శించారు.

మేయర్‌ను పరామర్శిస్తున్న దృశ్యం

ఇందూరు: నగర మేయర్ ఉమారాణి మాతృమూర్తి ఇటీవల మరణించడంతో కుటుంబాన్ని ఎమ్మెల్యే భూపతిరెడ్డి సోమవారం ఇంటికి వెళ్లి పరామర్శించారు. మేయర్ మాతృమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పాగంగారెడ్డి, పార్టీ నాయకులు భాస్కర్‌రెడ్డి, హన్మండ్లు, శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు అశోక్, రమేష తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఇందల్వాయి మండల బీజేపీ మైనార్టీ మోర్చ అధ్యక్షుడు రంజిత్‌నాయక్, తండా ఉపసర్పంచ్ సుదర్శన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు సోమవారం మండలంలో జరిగిన కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు.

చెట్లు నరికివేసిన గుర్తుతెలియని వ్యక్తులు

ఇందూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఇందల్వాయి రెవెన్యూ పరిధిలోని దేవితాండా శివారులో సర్వే నెంబర్ 1223లో గుర్తు తెలియని వ్యక్తులు చెట్లను నరికివేసినట్లు స్థానికులు తెలిపారు. పెద్ద ఎత్తున చెట్లను నరికివేసి భూమిని కబ్జా చేస్తున్నారన్నారు. కొంతకాలంగా ఇదే సర్వే నెంబర్‌లో యంత్రాల ద్వారా ప్రభుత్వ భూమిని చదును చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. అక్రమార్కులు చెట్లను నరికివేసి ప్రభుత్వ భూములను కబ్జా చేసి సాగు చేసుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్నప్పటికీ వారు ఏం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని వెంటనే తహసీల్దార్ ప్రభుత్వ భూములను కాపాడే చర్యలు చేపట్టాలని కోరారు.

హెడ్ కానిస్టేబుల్స్‌కు ఏఎస్సైగా ప్రమోషన్

ఇందూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 11మంది హెడ్ కానిస్టేబుల్స్‌కు ఏఎస్సైలుగా ఉద్యోగోన్నతి పొందారు. ఈ సందర్భంగా సీపీ సాయిచైతన్య సోమవారం తన చాంబర్‌లో ప్రత్యేకంగా అభినందించారు. ఎస్.గంగాధర్‌రావు(నందిపేట్), పి.రాజేశ్వర్ (ఉమెన్ పోలీస్‌స్టేషన్), మోహన్(సీసీఎస్), జగదీశ్వర్ (పీసీఆర్), చిన్న సాయిలు(సీఎస్‌బీ), రాజేందర్(సిరికొండ), రాజశేఖర్ (డిచ్‌పల్లి), సుదర్శన్ (నవీపేట్), భాస్కర్ (1టౌన్), సుంకన్న (2 టౌన్), మల్లేషం(వర్ని) ప్రమోషన్లు పొందారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఇందూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బడాబజార్‌లోని ఆర్యసమాజ్ ఏరియాలో వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు 2వ టౌన్ ఎస్‌హెచ్‌వో యాదగిరిగౌడ్ తెలిపారు. పంజాల అజయ్‌గౌడ్ (25) కొంతకాలం నుంచి పనిచేయక తాగుతూ రోడ్డుపైనే పడిపోయేవాడు. అతను ఆరు నెలల క్రితం యాసిడ్ తాగాడు. కుటుంబీకులు హాస్పిటల్లో చేర్చగా డాక్టర్ చెప్పిన సలహాలు పాటించక మద్యం తాగి ఎక్కడ పడితే అక్కడ పడిపోయేవాడు. సోమవారం అలాగే తాగి చనిపోయాడన్నారు. ఎస్‌హెచ్‌ఓ యాదగిరిగౌడ్ అక్కడికి చేరుకొని మృతదేహన్ని పరిశీలించారు. అతడి అన్న కృష్ణగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు.

ఆర్చరీలో రాష్ట్రస్థాయికి బోర్గాం విద్యార్థి

మోపాల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బోర్గాం(పి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి సురేష్ చౌదరి, 10వ తరగతికి చెందిన సోఫియాన్ రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శంకర్ తెలిపారు. ఆదివారం దోమకొండలో నిర్వహించిన పోటీలో సురేష్ గోల్డ్‌మెడల్ సాధించాడన్నారు. విద్యార్థులను అభినందించారు.

పాంచజన్య జోష్

టీయూ భూములను కాపాడాలి

(3వ పేజీ తరువాయి)

యూనివర్సిటీకి కేటాయించిన భూ ములను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. యూనివర్సిటీ అవసరాలను పక్కన పెట్టి భూములను ఇతర సంస్థలకు కేటాయించడం వల్ల భవిష్యత్‌లో యూనివర్సిటీ విస్తరణకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ ప్రభుత్వ భూమిని కేటాయించి తెలంగాణ యూనివర్సిటీ భూములను యూనివర్సిటీ అభివృద్ధికే వినియోగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ అంశంపై యూనివర్సిటీ అధికారులు కూడా స్పష్టమైన వైఖరి తీసుకోవాలని కోరారు. యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం విద్యార్థులు, అధ్యాపకులు, మేధావులు, ప్రజ లను కలుపుకొని ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్య మాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కా ర్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు నితిన్, సంజయ్, మున్నా పాల్గొన్నారు.

బీఈడీ ఫలితాలు విడుదల

తెలంగాణ వర్సిటీ 2024 బ్యాచ్ బీఈడీ కోర్సు ఫలితాలను వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. యాదగిరి సోమవారం విడుదల చేశారు. ఇందులో మొత్తం 1354 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 1288 మంది 95.12 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ ప్రొఫెసర్ కె.సంపత్ కుమార్ తెలిపారు. కార్యక్ర మంలో యూజీ కాన్ఫిడెన్షియల్ అడిషనల్ కంట్రోలర్ డాక్టర్ శాంత, తదితరులు పాల్గొన్నారు. పూర్తి వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు పేర్కొన్నారు.

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

సుభాష్‌నగర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వి.భుజంగరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 159 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్‌తో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, డీఆర్వో గీత, డీఆర్డీవో సాయన్న, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్, ఏసీపీ శ్రీశైలంలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. బ్రహ్మపురి కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఇతర స్థలానికి మార్చాలని మున్సిపల్ కార్పొరేషన్ 50వ డివిజన్ కార్పొరేటర్ జగదీష్ కులకర్ణి సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. నగరంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని రెవల్యూషనరీ యూత్ ఫ్రంట్ నాయకులు పిట్ల నరేష్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. నగరంలోని డైట్ కళాశాల ప్రిన్సిపల్ జపాన్ పర్యటనను రద్దు చేసి అతని పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. యంచ గ్రామ సమీపంలోని గోదావరి నది ఒడ్డున బస్సు బ్రిడ్జి పక్కన ప్రజలు కోరుకున్న స్థలంలో పుష్కర ఘాటును నిర్మించాలని ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. చందూరు, కోటగిరి బీసీ హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని క్రాంతి జనతా పార్టీ నాయకులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ డిఎస్పి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. దృష్టి లోపంతో ఇబ్బంది పడుతున్నానని రోజు ఆర్మూర్ నుంచి నిజామాబాద్‌కు ప్రయాణించడం ఇబ్బందిగా ఉందని దివ్యాంగురాలు బండి చిన్నబ్బాయి ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. బీడీ కార్మికులందరికీ షరతులు లేకుండా చేయూత పెన్షన్లను అందజేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వి.ప్రభాకర్ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. రమేష్‌లు డిమాండ్ చేశారు.

అదనపు కలెక్టర్ భుజంగరావుకు ఫిర్యాదు అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నిజామాబాద్ రూరల్ : రూరల్ మండల ప్రజావాణికి 12 ఫిర్యాదులు వచ్చినట్లు ఎంపీడీవో రాంనారాయణ తెలిపారు. కార్యక్రమానికి నోడల్ ఆఫీసర్ (ఎంపీడీవో)తోపాటు తహశీల్దార్, ఇతర రూరల్ అధికారులంతా పాల్గొన్నారు. వీటిలో అత్యధికంగా పెన్షన్ కోసం వచ్చినట్లు ఎంపీడీవో రాంనారాయణ తెలిపారు.

పోలీసు ప్రజావాణికి 34 ఫిర్యాదులు

ఇందూరు : పోలీసు ప్రజావాణి కార్యక్రమానికి 34 ఫిర్యాదులు వచ్చాయి. సోమవారం సీపీ తన చాంబర్‌లో ఫిర్యాదుదారుల నుంచి స్వయంగా వినతులు స్వీకరించి సమాధానం చెప్పారు. జిల్లాలో ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం

నిజామాబాద్ రూరల్, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలకు తప్పుడు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్ బీఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపిచ్చారు. సోమవారం జిల్లాకేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీజీగౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో తప్పుడు హామీలిచ్చిందని, వాటిని అమలు చేయలేక చతికిలపడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న ఆశలను అడియాశలు చేసిందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, నాయకులు గిర్దావర్ గంగాదర్, నట్ట భోజన్న, ఢీకొండ శ్రీనివాస్, మీసాల మధుకర్, అక్బర్‌నవాజుద్దీన్, గోపాల్‌రెడ్డి, మహిపాల్ యాదవ్, హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నోటీసుల పంపిణీ పరిశీలన

ఇందూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి) : నిజామాబాద్ నగరంలోని సంజీవయ్య కాలనీలో ఎస్‌ఐఆర్ సంబంధించిన నోటీసులను కాంగ్రెస్ ప్రతినిధులు, జిల్లా అధ్యక్షుడు నగేష్‌రెడ్డి, నుడా చైర్మన్ కేశవేణు, తదితరులు సోమవారం ప్రత్యేకంగా పరిశీలించారు. నోటీసులను పకడ్బందిగా పంపిణీ చేసి వందశాతం ఎవరిఓటు వెళ్లిపోకుండా జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రభుదాస్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సిబ్బందికి సీపీ సత్కారం

ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందికి సత్కారం చేస్తున్న సీపీ సాయి చైతన్య

ఇందూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఏళ్ల తరబడిగా విధులు నిర్వహించి సోమవారం రిటైర్డు అవుతున్న పోలీసు సిబ్బందిని పోలీసు కమిషనర్ సాయిచైతన్య తన చాంబర్‌లో ప్రత్యేకంగా సత్కరించారు. పోలీసుశాఖలో ఎంతో ఒత్తిడితో విధులు నిర్వహించి ఎలాంటి రిమార్కు లేకుండా ఉద్యోగ విరమణ చేయడం గొప్ప విషయమని అభినందించారు. కార్యక్రమంలో ఏఆర్‌హెడ్ క్వార్టర్స్ ఏసీపీ శ్రీరాములు, ఆఫీసు సూపరిండెంట్‌లు జగతి, వనమాల తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి సేవలను వినియోగించుకోవాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వాసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. నగరంలోని సుభాష్ నగర్‌లో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ నిధులను కేవలం 20 శాతం మాత్రమే చెల్లిస్తున్నారని, వీటిని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్న పేదలు తమ కార్యాలయంలో సంప్రదిస్తే ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేస్తామన్నారు. ఉత్తమ చికిత్స అందేలా చూస్తామన్నారు. అలాగే నిమ్స్‌లో చికిత్స పొందే వారికి తన ద్వారా ఎల్‌ఓసి అందజేస్తున్నానని పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కూడా రెండు టిమ్స్ ఆసుపత్రులు నిర్మించిందన్నారు. వాటి సేవలను కూడా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్‌లు మఠం పవన్, రాజేందర్, విజయ మల్లేష్ యాదవ్, కల్పే అర్చనా చిరంజీవి, సీనియర్ నాయకులు ఇప్పకాయల కిషోర్, మాస్టర్ శంకర్, స్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

స్కౌట్ అండ్ గైడ్స్ నూతన కార్యవర్గం

ఎన్నికైన నూతన కార్యవర్గసభ్యులు

సుభాష్‌నగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : స్కౌట్ అండ్ గైడ్స్ నూతన సెక్రెటరీగా డి.వెంకట్‌రావయులు ఎన్నికయ్యారు. ఎన్నికల అబ్జర్వర్ వెంకటేశ్వర్లు ఎన్నికలను నిర్వహించారు. జాయింట్ సెక్రెటరీగా ఆశాజ్యోతి, డీవోసీగా సల్మాన్, ట్రెజరర్‌గా అనిల్‌కుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎస్.జి.ఎఫ్ సెక్రెటరీ అలివేలు మంగ, పరశురాములు పాల్గొన్నారు.

సిరికొండలో రక్తదాన శిబిరం

సిరికొండ,ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి జన్మదినం సందర్భంగా సిరికొండంలో బీజేపీ మండల కమిటీ ఏర్పాటు చేసిన రక్తాదాన శిబిరంలో నలబై మంది యువకులు పాల్గొని రక్తాన్ని దానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్, జిల్లా నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, కనగందుల గోపి, మండల ప్రధాన కార్యదర్శి పాల్గొన్నారు.

డిచ్‌పల్లి :మండల కేంద్రంలోని మానవతా సదన్‌లో జిల్లా బీజేపీ అధ్యక్షుడు కులాచారి దినేష్ జన్మదిన వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పిల్లలకు కేకు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కర్ణ చంద్రకాంత్, బీజేవైఎం జిల్లా మాజీ అధ్యక్షుడు సతీష్ రెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు గంగారెడ్డి, విష్ణు, శ్రీనివాసరావు, క్రాంతి పాల్గొన్నారు.

గ్రామాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

సిరికొండ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన స్మార్ట్‌రేషన్ కార్డులను సర్పంచ్‌లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కొండూర్ గ్రామంలో సర్పంచ్ నర్మాల లతా, గడ్కోల్లో సర్పంచ్ సంద్ర లతా, మైలారంలో గ్రామంలో సర్పంచ్ సర్దాన్ సదానంద్, పోత్నూర్‌లో సర్పంచ్ మహిపాల్ స్మార్ట్‌రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

పాలిటెక్నిక్ విద్యార్థుల ధర్నా

నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

సుభాష్‌నగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సాంకేతిక విద్యా వ్యవస్థను యథాతథంగా కొనసాగించాలని జి.ఓ నం.97 రద్దు చేయాలని కోరుతూ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు ధర్నా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద వేలాదిమంది విద్యార్థులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న మార్పుల వల్ల పాలిటెక్నిక్ కళాశాలలు దెబ్బతినే అవకాశం ఉన్నందున ప్రస్తుత సాంకేతిక విద్యా వ్యవస్థను యథాతథం గా కొనసాగిస్తూ పాలిటెక్నిక్ విద్యను మరింత బలోపేతం చేయాలని కోరారు. పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి) : పాఠశాలల స్థాయి నుంచే విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని ట్రైనీకలెక్టర్ పాముర్తి సురేష్ అన్నారు. జిల్లాకేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవనశైలీ వ్యాధులపై, క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ ఉభయకాయానికి గురికాకుండా కళాశాలలో మిస్, మిస్టర్ పోటీలను నిర్వహించాలన్నారు. ప్రతి శాఖల సమన్వయంతో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మెడికల్ కళాశాల విద్యార్థులకు ప్రతి మండలంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలన్నారు.

కవితను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

సుభాష్‌నగర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి) మాదిగలకు న్యాయం చేయాలని టీఆర్‌ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల కవితను ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్ల మరి సుధాకర్ కలిశారు. జిల్లా కేంద్రంలోని నిర్వహించిన పంచ జన్య సంకల్ప సభలో కవితను కలిసి వినతి పత్రం అందజేశారు. మాదిగలు రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న ప్రభుత్వాలు తగినంత ప్రాధాన్యత ఇవ్వడం లేదని అన్నారు. 80 ఏళ్లు రిజర్వేషన్లు అనుభవించిన మాలలు మళ్లీ రోస్టర్ ఇవ్వాలని మళ్లీ కొట్లాట చేస్తున్నారని అన్నారు. డిక్కీ లాంటి సంస్థ మొదలుపెట్టిన వాటిలో కూడా మాదిగలకు అన్యాయమే జరిగిందన్నారు. సమస్యలన్నింటిపై టీఆర్‌ఎస్ పార్టీ ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సదా మీ సేవలో...

పత్రిక సరఫరాలో మీకు ఏమైనా ఇబ్బందులు ఉన్నా మరియు కొత్త కాపీ బుక్ చేసుకోవడానికైనా ఈ దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు..

నిజామాబాద్ - 84990 33193
బోధన్ - 82476 24486
ఆర్మూర్ - 99085 21686
భీమ్‌గల్ - 90329 30992

అసిస్టెంట్ సర్కులేషన్ మేనేజర్ : 99854 11454
బ్రాంచ్ మేనేజర్ సెల్: 99854 11451

సినిమా గైడ్

లలితమహాల్	: టాక్సిక్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్	: విశ్వనాథ్ అండ్ సన్స్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్	: ఇరుముడి (11.15, 2.15, 6.15, 9.15)
దేవి	: ఇరుముడి (11.15, 2.15, 6.15, 9.15)
ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్	
స్క్రీన్-1	: టాక్సిక్ (1.30, 7.00, 10.40)
స్క్రీన్-2	: టాక్సిక్ (10.30, 4.30)
	: ఇరుముడి (10.40)
స్క్రీన్-3	: ఇరుముడి (11.00,1.40,4.30,7.30)
పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)	
స్క్రీన్-1	: టాక్సిక్ (10.00)
	: ఇరుముడి (1..35,4.30,7.30,10.30)
స్క్రీన్-2	: టాక్సిక్ (10.30,2.30,6.30,10.30)
స్క్రీన్-3	: టాక్సిక్ (9.30,1.30, 5.30,9.30)
స్క్రీన్-4	: టాక్సిక్ (8.30,10.00)
	: విశ్వనాథ్ అండ్ సన్స్ (12.20,6.40)
	: ఇరుముడి(3.40)

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,51,700	రూ.1,43,700	రూ.2,400

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.135	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.230	రూ. 250

పదేళ్ల పింక్ పాలన కంటే.. వెయ్యిరోజుల ప్రజాపాలన భేష్

» ప్రజాభిమానాన్ని పొందిన సీఎం రేవంత్‌రెడ్డి: పొంగులేటి

కేసముద్రం బహిరంగ సభలో వృద్ధురాలిని ముద్దాడుతున్న పొంగులేటి

కేసముద్రం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): "పదేళ్ల పింక్ పార్టీ పాలన కంటే వెయ్యిరోజుల ప్రజాపాలన అందిస్తున్న కాంగ్రెస్ పాలన భేష్. ఈ విషయాన్ని రాష్ట్రంలోని ఏ ఇంటికి వెళ్లినా, ఏ ఆడబిడ్డను, ఏ రైతును అడిగినా చెబుతారు" అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. "వెయ్యిరోజుల ప్రభుత్వం ఏం చేసిందంటూ రేపో మాపో ఆ పింక్ కలరోళ్లు ఏదో కార్యక్రమం చేపడుతున్నారట! వాళ్లకు కళ్లుండి కనబడడం లేదా? చెవులుండి వినబడడంలేదా?" అని బీఆర్ఎస్ నేతలనుద్దేశించి మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. వెయ్యిరోజుల పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాభిమానం పొందారని తెలిపారు.

ప్రజల ఆశీస్సులకు అనుగుణంగా పాలన: తుమ్మల

ఖమ్మం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రజల ఆశీస్సులకు అనుగుణంగా రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రజాప్రభుత్వ పాలన సాగుతోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ వెయ్యి రోజుల్లో ఒక్కో సమస్యను పరిష్కరించుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలోకి తీసుకెళ్తున్నామని చెప్పారు. వ్యవసాయ శాఖ మంత్రిగా తాను సీఎం రేవంత్‌రెడ్డికి మంచి పేరు తెచ్చేలా పనిచేస్తున్నానని, రైతులు, రైతు కూలీల సంక్షేమానికి కృషిచేస్తున్నానని తెలిపారు. ఖమ్మం నగరంలో సోమవారంపర్యటించిన ఆయన.. ప్రకాష్‌నగర్‌లో రూ.12 కోట్లతో చేపట్టే రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సీఎం రేవంత్‌రెడ్డిని ఆశీర్వదించడంతో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని చెప్పారు. అన్నివర్గాలకు న్యాయం చేయాలనే తపనతో సీఎం పనిచేస్తున్నారని కితాబిచ్చారు. సీఎం ఆలోచనలకు అనుగుణంగా రైతుల సంక్షేమానికి తాను కృషిచేస్తున్నానన్నారు.

'ఇన్వెస్ట్ తెలంగాణ' సదస్సు నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు : డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరిగే ఈ సదస్సు ఏర్పాట్లపై సోమవారం ఆయన ప్రజాభవన్‌లో సమీక్ష నిర్వహించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు. సదస్సుకు సంబంధించి ప్రతి అంశాన్ని సమీక్షించి, నిర్ణయాలు వేగంగా తీసుకునేలా ప్రజాభవన్‌లో ప్రత్యేకంగా వార్‌రూమ్‌ను ఏర్పాటు చేయాలని భట్టి సూచించారు. సదస్సు నిర్వహణకు కమిటీలను ఏర్పాటు చేసి, సీనియర్ ఐఏఎస్ అధికారులకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. సదస్సుకు ప్రత్యేకమైన లోగోను రూపొందించాలన్నారు. అక్టోబర్ మొదటి లేదా రెండో వారంలో ఢిల్లీలో కర్టెన్‌రైజర్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

మూడు ఆస్పత్రులకు నేను సూచించిన పేర్లే

» సీఎం ప్రకటనపై మంత్రి కోమటిరెడ్డి హర్షం

అల్వాల్, ఎల్బీనగర్‌లలో నిర్మించే టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు... తాను సూచించిన పేర్లనే పెడతామని అంబర్‌పేటలో జరిగిన సభలో సీఎం ప్రకటించడంపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. అల్వాల్ టిమ్స్‌కు టి.అంజయ్య, ఎల్బీనగర్ టిమ్స్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ, వరంగల్ సూపర్ స్పెషాలిటీకి ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టాలని.. తాను సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభోత్సవం రోజు సీఎం రేవంత్‌ను కోరానని మంత్రి తెలిపారు. తన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించినందుకు ఆయన కృతజ్ఞతలు చెప్పారు.

జాతీయ సదస్సులో తెలంగాణ జలభద్రత నమూనా

» దేశానికి దిశానిర్దేశం చేసేలా రాష్ట్ర విధానం: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సుస్థిర జలవనరుల నిర్వహణపై కేంద్ర జలశక్తి శాఖ సెప్టెంబరు 1, 2 తేదీల్లో న్యూఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ సదస్సులో తెలంగాణ తన 'సమగ్ర జలభద్రత నమూనా'ను దేశం ముందుంచనుందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. సచివాలయంలో శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ సదస్సులో ఇవ్వాల్సిన ప్రజెంటేషన్, జలసంరక్షణ కార్యక్రమాలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. జలవనరుల సంరక్షణ నుంచి సురక్షిత తాగునీటి సరఫరా వరకు పలు అంశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం సాధిస్తూ, నిర్దిష్ట కాలపరిమితితో కూడిన జాతీయ కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని మంత్రి తెలిపారు.

బీఆర్ఎస్‌ది నిరసన రాజకీయం: మంత్రి పొన్నం

హైదరాబాద్, అక్కన్నపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాజకీయ ప్రయోజనాల కోసమే ప్రజా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నిరసనలకు పిలుపునిచ్చిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం చాపగాని తండాలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజా పాలనలో సాధించిన విజయాలను చూసి బీఆర్ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని పూర్తిగా అప్పులపాలు చేసిన బీఆర్ఎస్‌కు నిరసన తెలిపే నైతిక హక్కు లేదన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఉచిత బస్సు, రేషన్ కార్డులు, 72వేల ఉద్యోగాలు ఇచ్చామని, మహిళలను బస్సులకు యజమానులుగా చేశామని పేర్కొన్నారు.

జపాన్ భాష నేర్చుకుంటే ఉద్యోగావకాశాలు: వివేక్

జపాన్‌లో పని చేస్తున్న తెలంగాణ నర్సులతో మంత్రి వివేక్ వెంకటస్వామి భేటీ అయ్యారు. టామ్‌కామ్(తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ) బృందంతో కలిసి టోక్యో వెళ్లిన మంత్రి... జపాన్‌లో నర్సులు పని చేసే పరిస్థితులు, ఉద్యోగ సంబంధిత అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. రెండేళ్ల క్రితం టామ్‌కామ్ ద్వారా జపాన్‌కు వెళ్లిన తొలి బ్యాచ్ నర్సులు... తమ పని వాతావరణం, ఉద్యోగాలపై ఈ సందర్భంగా సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం 30 మంది తెలంగాణ నర్సులు జపాన్‌లో పని చేస్తున్నారని చెప్పారు. జపాన్ భాష నేర్చుకున్న నర్సులకు అక్కడ భారీగా ఉద్యోగావకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు.

471 ఎంఎల్‌డీ మురుగునీటి శుద్ధికి 22 ఎస్టీపీలు

» నిర్మాణ, నిర్వహణ బాధ్యతలు 'రాఘవ సీవరేజ్' సంస్థకు..

కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో మురుగునీటి శుద్ధి సామర్థ్యాన్ని భారీగా పెంచేందుకు 22 సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల(ఎస్టీపీ) నిర్మాణం, నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రూ.1906.44 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో మొత్తం 471.50 ఎంఎల్‌డీ సామర్థ్యంతో 22 ఎస్టీపీలను నిర్మించనున్నారు. జీహెచ్‌ఎంసీ పరిధి నుంచి ఓఆర్ఆర్ వరకు ఉన్న అన్ని మున్సిపాలిటీలను కవర్ చేస్తూ తలపెట్టిన ప్రాజెక్టు నిర్మాణ పనులను బీవీఎస్ఆర్-ఎస్‌జీఎస్-ఆర్‌సీపీఎల్ (జేవీ)కి అప్పగిస్తూ సోమవారం జీవో జారీ చేసింది. ప్రాజెక్టు కోసం రాఘవ సీవరేజ్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఎస్పీవీని ఏర్పాటు చేసి ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది.

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి-నిర్మల దంపతుల కుమారుడు దత్తుసాయిరెడ్డితో రమేశ్ పటేల్ - మాయ పటేల్ దంపతుల కుమార్తె పాలక్ పటేల్ నిశ్చితార్థం సోమవారం రాత్రి రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలోని ఇవంతర కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ.. కాబోయే దంపతులను ఆశీర్వదించారు.

కేసీఆర్ రాజీనామా చెయ్!

(మొదటిపేజీ తరువాయి)

వంతెనను ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబర్‌పేట వద్ద జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. వెయ్యి రోజుల ప్రభుత్వ పాలనపై నిరసన కార్యక్రమాలు చేపడతామని బీఆర్ఎస్ ప్రకటించిందని ప్రస్తావించారు. రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేయడం విఫలమైనట్టా? అని ప్రశ్నించారు. "వెయ్యి రోజుల్లో రూ.22.25 కోట్లు మెక్కినవ్... ఏనాడైనా పేదలు, ఆడబిడ్డలు, నిరుద్యోగులు, విద్యార్థులు, రైతులు, దళితులు, గిరిజనులు, ఆదివాసీల కోసం ఏమన్నా ఇచ్చావా దుర్మార్గుడా? నీ బంధువులు చనిపోతే దినాలకు పోతవు. నీ మనవడికి దెబ్బ తగిలితే దవాఖానకు చూడడానికి పోతవు. ప్రజల కోసం బయటకు రావా? ఇందుకోసమేనా కోట్ల రూపాయల జీతభత్యాలు ఇచ్చి తెలంగాణ నిన్ను సాకుతున్నది? పందికొక్కులా ప్రజల సొమ్ము మెక్కి ఫామ్ హౌస్‌లో పండుకుంటే అయిపోయిందా? వెయ్యి రోజులు మొఖం చాటేసిన ప్రతిపక్ష నేత దేశంలో ఎవడైనా ఉన్నడా?" అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఈ వెయ్యి రోజుల్లో తాను ఒక గంట సెలవు తీసుకోలేదని, కేసీఆర్ ఒక గంట సమయం కూడా వెచ్చించలేదని అన్నారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి 365 రోజులు విధులకు రాకుంటే ఉద్యోగం నుంచి డిస్మిస్ చేస్తారని, మరి వెయ్యి రోజులు రాని కేసీఆర్‌ను ఏం చేయాలని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబం ఐదుగురు తొమ్మిదిన్నర ఏళ్లు లక్ష కోట్లు దోచుకున్నారని, ఇప్పుడు వెయ్యి రోజుల్లో అప్పనంగా ప్రభుత్వం సొమ్ము మెక్కుతున్నారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ భవన్‌లో కార్యకర్తల రక్తం తీసుకొని, ప్రయివేటు ఆసుపత్రులకు అమ్ముకున్నరు. ఇంతకంటే దుర్మార్గుడు ఉంటరా? అని ప్రశ్నించారు. "హరీశ్‌రావు పెట్రోల్ తీసుకొని, అగ్గిపెట్టె మర్చిపోయిన నాటకం చూసి రెచ్చిపోయి ఎల్బీ నగర్‌లో శ్రీకాంతాచారి కాల్చుకున్నడు. 1200 మంది పిల్లలను పొట్టన పెట్టుకున్నది నువ్వు కాదా?" అన్నారు. వెయ్యి రోజుల్లో ఒక్క గంట కూడా ప్రజలకు కేటాయించని ప్రతిపక్ష నాయకుడు తక్షణమే రాజీనామా చేయాలనే డిమాండ్‌తో మంగళవారం నుంచి ఆరో తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కాంగ్రెస్, అనుబంధ సంఘాలకు ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఏడో తేదీన

అంబర్‌పేట సభలో జీహెచ్‌ఎంసీ నూతన లోగోను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్

అసెంబ్లీ మొదలవుతుందని, కేసీఆర్ ఇప్పటికైనా సభకు వచ్చి ప్రజల సమస్యల మీద మాట్లాడాలని సూచించారు. ఇప్పటివరకు అనేక కష్టాలు పడి వ్యవస్థను దారిలోకి తెచ్చానని, ఇప్పటి నుంచి ప్రయాణం సాఫీగా సాగుతుందని, ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. కాళ్లు, చేతులు కూడదీసుకున్నామని, పాలన పట్టాలెక్కిందని, ఇక సాఫీగా నడిపిస్తానని చెప్పారు. ఏ రోజు కూడా తన కుటుంబం కోసం అధికారాన్ని దుర్వినియోగం చేసే ప్రసక్తే లేదన్నారు. తనను గుంపు మేస్త్రీ అని వెక్కిరిస్తున్నారని, తన గుంపు ప్రజలేనని, అందరూ కలిసి తనకు ఈ జిమ్మేదార్ ఇచ్చిండ్రని చెప్పారు. అమెరికాలో బాత్‌రూమ్‌లు కడిగి, అక్కడ బతకలేక వచ్చినాయన లాగా తాను కంపెనీల సీఈవోగా ప్రాజెక్టు చేసుకోవడం లేదని చెప్పారు. "కేసీఆర్ నేను, ముసలామె.. మాకు బుక్కెడు బువ్వ చాలని తెలంగాణ ప్రజలను నమ్మించి, తరువాత కొడుకు, బిడ్డ, అల్లుడు, సడ్డకుడి కొడుకు, దయాకర్‌రావు, మాధవరం కృష్ణారావు, దివాకర్‌రావులను పిలిచిండు. మంద లెక్క జమైె మంది సొమ్ము తిన్నరు. నేను ఏమన్నా అట్ల చేసిననా? నాకు అవకాశం వస్తే బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్, హన్మంతన్న, అనిల్ కుమార్, నవీన్ యాదవ్‌లకు అవకాశం ఇచ్చా. వీళ్లంతా నాకు చుట్టాలా? కాంగ్రెస్ కోసం కష్టపడ్డరు. భట్టి విక్రమార్క, గడ్డం ప్రసాద్, దామోదర రాజనరసింహ, అడ్లూరి లక్ష్మణ్, వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, సీతక్క నా బంధువులా? కుటుంబ సభ్యులా? కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే కేటీఆర్, హరీశ్‌రావు, దయాకర్‌రావు, కృష్ణారావు, సంతోష్‌రావు, కవితారావులకు పదవులు ఇచ్చిండు. బయటోళ్లకు అవకాశం ఇచ్చిండా?" అని ప్రశ్నించారు. మహిళలకు ఉచిత ప్రయాణం పెడితే ఆటో డ్రైవర్లను ఉసిగొల్పిన దుర్మార్గపు చరిత్ర బీఆర్ఎస్‌దని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వంలో కనీసం ఒక రేషన్ కార్డు ఇచ్చారా? అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబంలో ప్రతీ ఒక్కరికీ భారీ ఫామ్‌హౌస్‌లు ఉన్నాయని ప్రస్తావించారు. పేదోడికి ఇళ్లు కట్టాలని, బువ్వ పెట్టాలని ఒక్కరోజైనా ఆలోచన చేసినవా? అని ప్రశ్నించారు. సనత్‌నగర్ టిమ్స్‌కు మర్రి చెన్నారెడ్డి పేరు పెడితే ఆయన కాలి గోటికి సరిపోని వాళ్లు రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. అల్వాల్ టిమ్స్‌కు మాజీ ముఖ్యమంత్రి అంజయ్య పేరు, ఎల్బీనగర్ టిమ్స్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు, వరంగల్ టిమ్స్‌కు జయశంకర్ పేరు పెడుతున్నట్లు ప్రకటించారు. సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ తీసేస్తామంటున్న వాళ్లకు అదే ప్రాంతంలో సర్దార్ సర్వాయి పాపన్న, జ్యోతిరావు పూలె విగ్రహాలు పెట్టాలని ఆలోచన ఎందుకు రాలేదని ప్రశ్నించారు. మలి దశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మను బీఆర్ఎస్ అనాథలా రోడ్డు మీద వేస్తే మహిళా కమీషన్ సభ్యురాలిగా నియమించామని, చాకలి ఐలమ్మ పేరును కోఠి మహిళా వర్సిటీకి పెట్టామని, ఆమె ముని మనువరాలిని మహిళా కమీషన్ సభ్యురాలిని చేశామని ప్రస్తావించారు. తాము ఏడాదికి రెండు లక్షల ఇళ్లు కడుతున్నామని, కేసీఆర్ పదేళ్లలో 20 లక్షల ఇళ్లు ఎందుకు కట్టలేక పోయారని అడిగారు. అంబర్‌పేటలో 10 ఎకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తామని సీఎం ప్రకటించారు. బతుకమ్మ కుంటను కబ్జా పెట్టిన ఎడ్ల సుధాకర్‌రెడ్డి కేసీఆర్ కోసం హెలికాప్టర్‌తో పూల వర్షం కురిపించాడని, కేసీఆర్ అలాంటి వ్యక్తులను ప్రోత్సహిస్తారని చెప్పారు. రూ.16 వేల కోట్ల మిగులు, రూ.70 వేల కోట్ల అప్పుతో కొత్త రాష్ట్రం ఏర్పడితే దాన్ని రూ.8.11 లక్షల కోట్లకు పెంచిన ఘనత కేసీఆర్‌ది అన్నారు.

ట్రై కార్పొరేషన్లకు కొత్త లోగోలు

నగరంలోని 3 మునిసిపల్ కార్పొరేషన్లకు కొత్త లోగోలు వచ్చాయి. అంబర్‌పేట సభలో సీఎం రేవంత్ వాటిని ఆవిష్కరించారు. ఆరున్నర నెలల క్రితం ఏర్పడిన జీహెచ్‌ఎంసీ, మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ), సైబారాబాద్ మునిసిపల్ కార్పొరేషన్(సీఎంసీ)లకు పురపాలక శాఖ లోగోలు రూపొందించింది. ప్రత్యేక ఆకారంలో 'ఎం' అక్షరాన్ని రూపొందించారు.పచ్చని ఆకులు, నీటి బొట్టు ఆకారాలు.. పచ్చదనం, పర్యావరణం, మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణను ప్రతిబింబిస్తాయని అధికారులు తెలిపారు.

నేడు ఢిల్లీకి రేవంత్‌రెడ్డి

ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ మావలంకర్ హాల్లో బుధవారం సాయంత్రం జరిగే వైఎస్ఆర్ అవార్డు ప్రదాన కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక విశిష్ట అతిథిగా హాజరు కానున్నారు. మాజీ ఎంపీ కేవీపీ రాంచందర్‌రావు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, విశిష్ట అతిథిగా జైరాం రమేష్, గౌరవ అతిథులుగా తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్, మంత్రి శ్రీధర్ బాబు హాజరు కానున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంగళవారం రేవంత్ ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

152 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి!

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి లేఖ రాశారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం ఢిల్లీలో మహారాష్ట్ర, తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శులతో కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) కీలక సమావేశం జరుగుతోంది. 150 మీటర్ల ఎత్తుతోనే బ్యారేజీ నిర్మాణం కోసం తొలుత కసరత్తు జరిగింది. 152 మీటర్ల ఎత్తు కోసం పట్టుబట్టాలని అధికారులకు ఉన్నత స్థాయిలో ఆదేశాలు వచ్చాయి. దాంతో 152 మీటర్ల ఎత్తుతో కలిగే ముంపు, నీటి లభ్యత, ప్రయోజనాలపై సమగ్ర నివేదికను సిద్ధం చేశారు. ఒక బ్యారేజీ వార్ధాపై, మరొకటి వెన్‌గంగాపై కట్టాలని ప్రతిపాదించారు. వార్ధా బ్యారేజీని 60 గేట్లతో, వెన్‌గంగాను 77 గేట్లతో నిర్మాణం చేపట్టాలన్నది యోచన. 867 మీటర్ల పొడవున వార్ధా, 1113.5 మీటర్ల పొడవున వెన్‌గంగా బ్యారేజీల నిర్మాణం చేపట్టాలన్నది ఆలోచన. ఈ రెండు కూడా 150 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తారు. నది ప్రవాహానికి అడ్డంగా లంబాకారంలో బ్యారేజీల నిర్మాణం చేపట్టాలన్నది ప్రతిపాదన. ఈ డిజైన్‌ను సీడబ్ల్యూసీతో సంప్రదింపులు జరిపి, సర్వేలో ప్రతిపాదించారు. ఈ మేరకు ప్రభుత్వానికి తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదిక(పీఎఫ్ఆర్)ను ఆర్వీ అసోసియేట్స్ అందించింది. ఎటువంటి గ్రామాల ముంపు లేకుండా 150 మీటర్ల ఎత్తుతో బ్యారేజీలు కట్టవచ్చని గుర్తు చేసింది. తెలంగాణ, మహారాష్ట్రల్లోనూ గ్రామాల ముంపు ఉండబోదని ఆ నివేదికలో పేర్కొన్నారు. 150 మీటర్ల ఎత్తుతో కడితే 4,215 ఎకరాల నదీగర్భం, చాప్రాల ఎకో సెన్సిటివ్ జోన్‌కు చెందిన 943 ఎకరాలు ముంపునకు గురి అవుతాయి. అయితే, 1,018 ఎకరాలు సేకరిస్తే చాలని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీని 148 మీటర్ల ఎత్తుతో కట్టుకోవడానికి 2016 మార్చి 8వ తేదీన మహారాష్ట్రతో ఒప్పందం కూడా జరిగింది. దీన్ని అప్పట్లో 165 టీఎంసీలతో ప్రతిపాదించారు. 2015 ఫిబ్రవరి 13న హైడ్రాలజీ అనుమతి కూడా లభించింది. ఇరిగేషన్ ప్లానింగ్, అంతరాష్ట్ర క్లియరెన్స్, సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు(భూగర్భ జలాలపై), నిర్మాణం కోసం వినియోగించే యంత్ర పరికరాలు, మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్(పంటలపై) అనుమతులు వచ్చాయి. ఇక పర్యావరణ అనుమతి కోసం తెలంగాణలో 2011 ఏప్రిల్‌లో బహిరంగ విచారణ కూడా జరిగింది. మహారాష్ట్రలో మాత్రం ఈ పని పూర్తికాలేదు. పలు అనుమతులు ఇదివరకే ఉండటంతో ఢిల్లీలో జరిగే భేటీలో మహారాష్ట్రను అధికారుల స్థాయిలో ఒప్పించే పనిలో రాష్ట్ర ప్రభుత్వం పడింది. అధికారుల స్థాయిలో సమావేశం అనంతరం ముఖ్యమంత్రుల స్థాయిలో తదుపరి భేటీ ఉంటుందని తెలుస్తోంది. తొలుత మహారాష్ట్ర ముందు 152 మీటర్ల ఎత్తు ప్రతిపాదనను ఉంచి, కనీసం 150 మీటర్ల ఎత్తుతో అయినా ఒప్పించాలని ప్రభుత్వం పట్టుదలతో ఉంది. మంగళవారం జరిగే సమావేశానికి సహకరించడానికి సీఎంవో కూడా రంగంలోకి దిగింది. సీఎం కార్యాలయ కార్యదర్శి మాణిక్కరాజ్ కన్నన్, ప్రభుత్వ సలహాదారుఆదిత్యనాథ్ దాస్, నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్‌తోపాటు కీలక అధికారులంతా భేటీలో పాల్గొంటున్నారు.

ఫ్యూచర్ సిటీలో నార్త్ ఈస్టర్న్ వర్సిటీ క్యాంపస్

(మొదటిపేజీ తరువాయి)

